

పాత పెన్షన్ కోసం నేడు ధర్నా

నెల్లూరు(విద్య), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పాత పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డీఎస్సీ - 2003 టీచర్స్ ఫోరం పోరాటానికి సన్నద్ధమయ్యింది. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చింది. దీనికి ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించాయని ఆ ఫోరం జిల్లా కన్వీనర్లు సుబ్బయ్య, మాస ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాము చేస్తున్న పోరాటానికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ ధర్నాకు మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆపస్ జిల్లా అధ్యక్షుడు కేకే రాజగోపాలాచారి, ప్రధాన కార్యదర్శి పీ అనిల్‌కుమార్ మరో ప్రకటనలో పేర్కొన్నారు.

మేం చెప్పినోళ్లకే!

జిల్లాలో ఇప్పటివరకు అవసరానికి మించి యూరియా పంపిణీ చేశామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతునా సొసైటీలు, రైతు సేవా కేంద్రాలకు రైతుల తాకిడి మాత్రం తగ్గడం లేదు. దీనికి ప్రధాన కారణం రాజకీయ నాయకుల జోక్యమేనన్న విషయం అందరికీ తెలిసిందే. అధికార దర్పం ప్రదర్శించి అవసరానికి మించి కొంత మంది మండల, గ్రామస్థాయి నాయకులు వందల బస్తాలను తరలిస్తున్నారు. దీంతో రైతులకు యూరియా దొరకడం లేదు. కొంతమంది పంటలు సాగు చేయకపోయినా యూరియాను ఇళ్లకు తరలించుకుంటున్నారు. ఇదేమిటని ప్రశ్నించే పరిస్థితి ఎంఏవోలు, వీఏఏలకు లేకుండా పోయింది. దీంతో చేసేదిలేక చిన్న, సన్నకారు రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా తీసుకుని వ్యాపారులు కూడా అధిక ధరలకు లేదంటే యూరియాతోపాటు డీఏపీ లేదా పురుగు మందులు కొనుగోలు చేయాలనే షరతులు పెడుతున్నారు.

"మేము చెప్పిన వాళ్లకే ముందుగా ఎరువుల బస్తాలు ఇవ్వాలి. మిగిలినవి కూడా ఎవరికి ఇస్తున్నారో ముందుగా మాకు చెప్పాలి. మాకు తెలియకుండా ప్రతిపక్ష పార్టీ సానుభూతిపరులకు ఒక్క బస్తా ఇచ్చినా పద్ధతిగా ఉండదు. అంతేకాదు.. మాకు తెలియకుండా ఇండెంట్ కూడా పెట్టకూడదు. ఎవరికీ ఇవ్వకూడదు.'

- మండల వ్యవసాయాధికారులు (ఎంఏవో), గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ)లకు అధికార పార్టీ నాయకుల నుంచి వస్తున్న హెచ్చరికలవి.





ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ కార్యాలయం వద్ద ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్న అన్నదాతలు (ఫైల్)

- వారికిచ్చారో పద్ధతిగా ఉండదు!
- యూరియా పంపిణీలో అధికార పార్టీ నాయకుల తీరిది!
- 2,50,787 ఎకరాల్లో పంటల సాగు.. పంపిణీ చేసింది 40వేల మెట్రిక్ టన్నులు
- అవసరానికి మించి ఇచ్చామంటున్న వ్యవసాయ శాఖ
- యూరియా దొరక్క చిన్న, సన్నకారు రైతుల అవస్థలు
- సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్న ఎంఏవోలు, వీఏవోలు

జిల్లాలో సాగునీరు పుష్కలంగా ఉండటంతో ఈ ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం కంటే దాదాపు 57వేల ఎకరాలకుపైగా వరిసాగు పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటివరకు 1,55,975 ఎకరాల్లో వరిసాగు అయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే, మరో 94,812 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతున్నాయి. సాగునీరు పుష్కలంగా ఉండడంతో ఈ సీజన్‌లో క్రాప్ హాలిడే ప్రకటించే కొన్ని మండలాల్లో సైతం అన్నదాతలు వరి సాగుకు ముందుకొచ్చారు. మొత్తంగా 2,50,787 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి.

● ఎకరానికి 3 బస్తాలు మాత్రమే

ఎకరాకి 3 బస్తాల యూరియా మాత్రమే వ్యవసాయ శాఖ అందిస్తోంది. ఈ ప్రాతిపదికనే ప్రభుత్వం యూరియా సరఫరా చేస్తోందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వరినాట్ల తరువాత 12 రోజులకు, 25 రోజులకు, 35 రోజులకు మూడు దఫాలుగా మొత్తం 135 కేజీల యూరియా సిఫార్సు చేస్తారు. ఈ లెక్కన జిల్లాలో సాగవుతున్న 1,55,975 ఎకరాల్లోని వరిసాగుకు 21,056 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. అయితే ఇప్పటివరకు 33,853 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. కొంతమంది రైతులు ఎకరాకి 5 బస్తాలకు మించి కూడా వినియోగిస్తున్నారు. ఇతర పంటలకు పంపిణీ చేసిన యూరియాతో కలిపి మొత్తం ఇప్పటివరకు దాదాపుగా 40వేల మెట్రిక్ టన్నులు జిల్లావ్యాప్తంగా పంపిణీ చేయడం జరిగింది. ఇందులో సగానికిపైగా యూరియా ఆర్ఎస్‌కేలు, సొసైటీల ద్వారా రైతులకు అందజేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

● యూరియా ఎటుపోతోంది!?

జిల్లావ్యాప్తంగా అవసరానికి మించి యూరియా అందిస్తున్నామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నా రైతులు యూరియా కోసం సొసైటీలు, ఆర్ఎస్‌కేలకు ఎందుకు వస్తున్నారు? రైతులకు అందుబాటులో పెట్టిన యూరియా ఏమైపుతోందని

- మిగతా 7లో..

జిల్లాకు మేలు జరిగేలా

- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- మొక్కుబడిగా అజెండా ● సమగ్ర చర్చ అవసరం

జడ్పీ సభ జరిగేనా ?

- గత సభల్లో కనిపించని ముఖ్యులు ● ఈసారైనా సభ్యులంతా హాజరయ్యేనా?

నెల్లూరు (జడ్పీ), జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగనుంది. ఈ సమావేశానికి అజెండా ను మొక్కుబడిగా రూపొందించారు. కేవలం పంచాయతీరాజ్, డ్వామా, జిల్లా గ్రామీణాభివృద్ధి, విద్యా, విద్యుత్ శాఖలపై సమీక్ష జరిపేలా అజెండాలో పేర్కొన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఈ సమావేశాన్ని ఉదయం 10:30 గంటల నుంచి జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు.



నిలిచిన హౌసింగ్ బిల్లులు

జిల్లాలో గృహ నిర్మాణ శాఖకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొంత వేగవంతం చేసిన పనులకు దాదాపు రూ.4కోట్ల మేర బిల్లులు నిలిచి పోయాయి. కాంట్రాక్టర్లు, లబ్ధిదారులు పనులను అనుకున్నంత స్థాయిలో నిర్వహించడం లేదన్న ఆరోపణలున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వచ్చే ఏడాది మార్చికి గృహనిర్మాణాల ప్రారంభం ప్రశ్నార్థకంగా మారింది. అలాగే డ్వామా ఆధ్వర్యంలో జరుగుతున్న పల్లె పండుగ కార్యక్రమానికి సంబంధించి దాదాపుగా 40శాతం బిల్లులు ఆగాయి. అనేక పనులు పూర్తి కాలేదు. అదేశాఖ ఆధ్వర్యంలో ఉద్యాన పంటలు పెద్దఎత్తున సాగుచేసేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ పంటలు నియోజకవర్గాల పరిధిలో ఎక్కువ భాగం ఏర్పాటు చేయాలంటే సభ్యులంతా సమావేశానికి హాజరై చర్చించాల్సిన అవసరం ఉంది. ఇక, విద్యుత్ శాఖ విషయానికి వస్తే పల్లెలకు త్రీఫేస్ కరెంటు ఏర్పాటు చేసే పనులు మూడేళ్లుగా నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. మరోవైపు జిల్లా పరిషత్ ఆదాయ వనరులు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. అటు ప్రభుత్వంతోపాటు, ఇటు సాధారణ నిధులు సమకూర్చి జడ్పీ ఆర్థికాభివృద్ధికి పాలకులు బాటలు వేయాల్సిన అవసరం ఉంది. అలాగే జిల్లాలో తాగునీటి పథకాల పనులను వేగవంతం చేయాల్సి ఉంది. వీటన్నింటిపై సమగ్ర చర్చ జరిగితేనే జిల్లాకు మేలు జరుగుతుంది. దీనికి పాలకులతోపాటు, ఉన్నతాధికారులంతా సమావేశానికి హాజరు కావడం అవశ్యం.

గత సభలు నీరసంగా...

కొంత కాలంగా జడ్పీ సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. మార్చి నెలలో బడ్జెట్‌తోపాటు ఇతర అంశాలపై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ కోరం లేక ఆ సమావేశం వాయిదా పడింది. ఏప్రిల్ 30న అదే సమావేశాన్ని తిరిగి నిర్వహించారు. ఆ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితర ముఖ్యమైన సభ్యులు హాజరుకాలేదు. ఆ సమావేశాన్ని కేవలం బడ్జెట్ ఆమోదానికే సరిపెట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగే సమావేశానికైనా సభ్యులందరూ వస్తారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సోమశిలకు పెరిగిన వరద

అనంతసాగరం జూలై 17 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం పెరిగింది. బుధవారం 2,806 క్యూసెక్కులు రాగా గురువారానికి 3,044 క్యూసెక్కులకు చేరింది. ప్రస్తుతం డ్యాంలో 28 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 3,750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

కాజ్‌వేకు పెరిగిన అంచనా

- ప్రస్తుతం రూ.93 కోట్లతో ఫేజ్-1 పనులు
- ఫేజ్-2కు మరో రూ.90 కోట్లు అవసరం
- అంచనాలు రూపొందించిన అధికారులు
- అనుమతుల మంజూరుకు ప్రజాప్రతినిధులపైనే భారం

నెల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంత మండలాల కనెక్టివిటీలో కీలకమైన ముదివర్తి-ముదివర్తిపాలెం కాజ్ వే నిర్మాణం కీలక దశకు చేరుకుంది. ఇప్పటివరకూ ఫేజ్-1 కింద 40 శాతం వరకూ పనులు పూర్తి కాగా, ఫేజ్-2 పనులకు అనుమతులు తెచ్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ముదివర్తి-ముదివర్తిపాలెం మధ్య కాజ్ వే నిర్మాణానికి సుమారు రూ.97 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 2021లో ప్రభుత్వం రూ.93 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అయితే సాంకేతిక కారణాలతో ఆ ప్రాంతం నుంచి కింది భాగంలో నిర్మించేందుకు తీర్మానించారు. మొదట 3.5 లక్షల క్యూసెక్కుల డిశ్చార్జికి తగ్గట్లు కాజ్ వేను రూపొందించగా, ఆ తర్వాత 7 లక్షల క్యూసెక్కుల డిశ్చార్జిని కూడా తట్టుకునేలా అంచనాలు వేశారు. 2022లో మిగిలిన పనులకు ఎస్టిమేషన్లు వేయగా రూ.50 కోట్ల వరకూ అవసరమవుతుందని ఇరిగేషన్ ఇంజనీర్లు తేల్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. ముందు పరిపాలన అనుమతులు ఇచ్చిన రూ.93 కోట్లతో ఫేజ్-1 కింద కాజ్ వే నిర్మాణ పనులు మొదలుపెట్టాలని ఆదేశించింది. దీంతో వెంటనే టెండర్లు పిలిచారు. అయితే ఆ తర్వాత బిల్లుల సమస్యతో చాలా కాలం పనులు సాగలేదు. గతేడాది ప్రభుత్వం మారాక ఈ పనుల్లో వేగం పుంజుకుంది. ఇప్పటి వరకూ సుమారు 40 శాతం మేర పనులు జరిగాయి. అప్‌స్ట్రీమ్ వైపు 200 మీటర్ల వరకూ షీట్ ఫైల్స్‌ను అమర్చగా, డౌన్ స్ట్రీమ్ వైపు 800 మీటర్ల వరకూ షీట్‌ఫైల్స్ ఏర్పాటు పూర్తి చేశారు. ఇటీవల రూ.17.50 కోట్ల బిల్లును ఇరిగేషన్ అధికారులు అప్‌లోడ్ చేశారు. అయితే ఇంకా బిల్లు విడుదల కాలేదు. దీంతో పనులు కొంత నెమ్మదించాయి.

● తీర ప్రాంతాలకు అత్యవసరం

ముదివర్తిపాలెం కాజ్ వే నిర్మాణంలో ఫేజ్-2 కింద మిగిలిన 500 మీటర్ల నిర్మాణానికి అనుమతులు రావాల్సి ఉంది. అలానే అటు వైపు ముదివర్తి, ఇటువైపు ముదివర్తిపాలెం వరకూ అప్రోచ్ రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఇందుకు కొంత మేర భూసేకరణ కూడా చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం అదనంగా మరో రూ.90 కోట్ల వరకూ అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలకు సీఈ కూడా ఆమోద ముద్ర వేశారు. కాజ్‌వే నిర్మాణంలో ఫేజ్-2 పనులే కీలకం. ఈ నేపథ్యంలో ఈ పనులకు అనుమతులు సాధించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపైనే ఉంది. తీర ప్రాంత ప్రజలకు కాజ్ వే నిర్మాణం ఎంతో అవసరం. ఇందుకూరుపేట, టీపీ గూడూరు, ముత్తుకూరు, విడవలూరు, కొడవలూరు, అల్లూరు మండలాల ప్రజలకు కాజ్ వే ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం నెల్లూరుకు దిగువన పెన్నాకు ఇరువైపులా ఉన్న మండలాల ప్రజలు అటు, ఇటు వెళ్లాలంటే నెల్లూరును చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కాజ్ వే నిర్మాణం పూర్తయితే వారందరికీ రవాణా భారం తగ్గుతుంది.



కాజ్ వే నిర్మాణంలో భాగంగా పెన్నా నదిలోకి దించుతున్న షీట్‌ఫైల్స్

అంచనాలు తయారు చేస్తున్నాం

ముదివర్తిపాలెం కాజ్ వే నిర్మాణానికి సంబంధించి కొంత మేర పనులకు మాత్రమే మొదట అనుమతులు వచ్చాయి. వాటినే ఇప్పుడు చేస్తున్నాం. మిగిలిన పనులకు సంబంధించి అంచనాలు రూపొందిస్తున్నాం. ఇటీవల సీఈ కూడా వచ్చి పరిశీలించారు. త్వరలోనే ఈ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతాం.

- దేశానాయక్, ఇరిగేషన్ ఎస్ఈ



వెంగమాంబకు చీర, సారె సమర్పించేందుకు ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ఉత్సవం

నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు అమ్మవారి నెల పొంగళ్ల ఉత్సవం గురువారం వేడుకగా జరిగింది. భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

- వివరాలు 8లో...

పేదల గడప..

పెద్దల చలువ!

- పీ 4 అమలుకు ముమ్మర కసరత్తు
- 1,06,878 బంగారు కుటుంబాల గుర్తింపు
- 837 మంది మార్గదర్శకుల ఎంపిక

నెల్లూరు(హరనాథపురం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాత్మక అడుగులు వేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం (పీ4) అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నిరుపేద కుటుంబాలను సంపన్నులు దత్తత తీసుకుని వారి ఆర్థికాభివృద్ధికి చేయూత ఇవ్వాలన్నది ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇళ్ల స్థలాలు ఇవ్వడం, ఇళ్లు నిర్మించడం, పారిశుధ్యం సౌకర్యాలు కల్పించడం, నూరు శాతం కొళాయి కనెక్షన్లు ఇవ్వటం, విద్యుత్ సరఫరా తదితరాలు ఈ కార్యక్రమం ద్వారా అందేలా చూస్తారు. ఈ కార్యక్రమానికి విరాళాలిచ్చే వారిని మార్గదర్శులని, ఆర్థిక బలహీనమైన లబ్ధిదారుల కుటుంబాలను బంగారు కుటుంబాలని పిలుస్తారు. ఎన్నారైలతోపాటు పేదలకు మద్దతుగా నిలిచేందుకు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో ఎవరైనా భాగస్వాములు కావచ్చు. జిల్లావ్యాప్తంగా 1,06,878 బంగారు కుటుంబాలను గుర్తించగా, ఈ కుటుంబాలలో 2,84,610 మంది సభ్యులు ఉన్నారు.

● 837 మంది మార్గదర్శులు

ఇప్పటివరకు 837 మార్గదర్శులను జిల్లాలో ఎంపిక చేశారు. ఈ మార్గదర్శులు 4,609 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. మార్గదర్శుల ఎంపికకు గ్రామస్థాయిలో సచివాలయ ఉద్యోగులతో కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయి, మండల స్థాయి అధికారులు మార్గదర్శుల ఎంపిక కోసం పని చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా ఈ నెల 15వ తేదీ నాటికి పూర్తయ్యింది. జిల్లా ప్రణాళికాధికారి లక్ష్మీనరసింహులు రోజువారీ డేటా తదితరాలు సేకరిస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నెల్లూరుకి రాష్ట్రంలో 4వ స్థానం

● జాతీయ స్థాయిలో 37వ ర్యాంకు

నెల్లూరు (సిటీ), (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛసర్వేక్షణ్‌లో నెల్లూరు నగరానికి రాష్ట్రస్థాయిలో 4వ స్థానం, జాతీయ స్థాయిలో 37వ ర్యాంకు దక్కినట్లు కమిషనర్ నందన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 వార్షిక స్థానాలు, ర్యాంకులు వెల్లడయ్యాయని తెలిపారు. పారిశుధ్యం, ఘన వ్యర్థాలు శాస్త్రీయంగా నిర్వహణ, రీసైక్లింగ్ కేంద్రాలు, ప్రజామరుగుదొడ్లు తదితర అంశాలు ర్యాంకుల సాధనకు కారణాలైనట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ సూచనలతోనే ఈ ర్యాంకులు సాధించడానికి దోహదపడ్డాయన్నారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికుల కృషి అభినందనీయమన్నారు.

మార్కెట్ కమిటీలకు అధ్యక్షుల నియామకం

నెల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా తొలుత కమిటీల అధ్యక్షులను ప్రకటించింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవులను ప్రకటించడంతో అధి కార పార్టీలో సందడి నెలకొంది. ఆత్మకూరు ఏఎంసీ చౌర్మన్‌గా అరికట్ల జనార్ధన్ నాయుడు, కావలి ఏఎంసీ చైర్మన్‌గా పోతుగంటి అలేఖ్య, నెల్లూరు ఏఎంసీ చైర్మన్‌గా మనుబోలు శ్రీధర్‌రెడ్డి, రాపూరు ఏఎంసీ చైర్మన్‌గా ఆవుల వాణిలను నియమించారు. సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్‌గా గాలి రామకృష్ణారెడ్డిని ఇది వరకే నియమించిన విషయం తెలిసిందే.



జిల్లాలో మోస్తరు వర్షం

నెల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. నెల్లూరుతోపాటు చాలా ప్రాం తాల్లో సాయంత్రం గంటపాటు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. గడిచిన పది రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. బుధవారం నాడు దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రత (40.2 డిగ్రీలు) నెల్లూరులో నమోదవడం గమనార్హం. ఎండ వేడిమికి ఉక్కపోత కూడా ఎక్కువైంది. దీంతో ప్రజలు అల్లాడుతున్నారు. గురువారం మధ్యాహ్నం వరకు కూడా భానుడు భగ్గుమన్నాడు. అయితే ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి చినుకులు పడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రానున్న ఒకటి, రెండు రోజులు కూడా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. కాగా గురువారం సాయంత్రం కురిసిన గంట వర్షానికే నెల్లూరు నగరంలో వర్షపు నీరు రోడ్లపై పారింది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువయ్యాయి.

కోడూరులో ఉచిత వైద్య శిబిరం

తోటపల్లిగూడూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కోడూరు సచివాలయాల్లో గురువారం నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్నవారికి సంబంధిత వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మరుసటి రోజు వైద్యశాల ఆధ్వర్యంలో బస్సు వసతి ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ గుడి ఝాన్సీ ప్రవల్లిక, డాక్టర్ జేఎస్ఆర్ ప్రభాత్, పీఆర్‌ఓ నందకిషోర్‌లు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9369
వెండి కిలో ధర	రూ. 114200
వెండి ఒక గ్రాము	రూ. 117.20

మధ్యాహ్న భోజనం నాణ్యత పెరగాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎస్ఆర్ హైస్కూల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈఓ దిలీప్ కుమార్, టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం వారు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. శుచి, శుభ్రతతో పాటు నాణ్యమైన ఆహార పదార్థాలను వండాలని వారు నిర్వాహకులను హెచ్చరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులుతో చర్చించారు. భోజనం తయారీలో పరిశుభ్రతను పాటించాలని, వడ్డించేవాళ్లు తప్పనిసరిగా మాస్కులు ధరించాలన్నారు. భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్నం నాణ్యతగానే ఉందని, కూరలు ఇంకా రుచికరంగా వండాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంపీ శేషయ్య, వార్డ్ ఇన్‌చార్జ్ దశరథ, తెలుగు యువత అధ్యక్షుడు కేఎస్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

తోటపల్లిగూడూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండలాధ్యక్షుడు కొణతం రఘుబాబు పేర్కొన్నారు. కోడూరు గ్రామంలో గురువారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ అందిస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మన్నెం జితేంద్ర, యూనిట్ ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి వెంకటేశ్వర్లు, బూత్ ఇన్‌చార్జ్ రవి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పికెట్


వడ్డిపాలెంలో పోలీసు పికెట్

ముత్తుకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పిడతాపోలూరు వడ్డిపాలెంలో గురువారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ముత్తుకూరు ఎస్‌ఐ విశ్వనాథ్ రెడ్డి వడ్డిపాలెంలో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఘర్షణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం వడ్డిపాలెంలో పరిస్థితులు ప్రశాంతంగా ఉన్నాయన్నారు.

కామాక్షితాయి సేవలో..

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ ఆలయంలో దేవదాయ శాఖ మంత్రి పర్సనల్ సెక్రటరీ కడారి వివేక్ కుటుంబ సమేతంగా శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి వారిని దర్శించుకున్నారు ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు ఆదిదంపతులను దర్శించుకున్నారు.

కుర్చీల వితరణ

రాపూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీవీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రాపూరు పట్టణవాసి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ గజారా వేణుగోపాల్, ఆయన తనయుడు గజారా పెంచల సాయికిషోర్ అధ్యాపకుల సౌకర్యార్థం ప్రిన్సిపాల్ కృష్ణవేణి, భౌతిక శాస్త్ర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ అధికారి సాయికిరణ్‌ల ఆధ్వర్యంలో కళాశాలకు అందించారు.


కుర్చీలు అందజేస్తున్న వేణుగోపాల్

ఫాగింగ్ చేయరు.. దోమలు చావవు!

● అధికారుల నిర్లక్ష్యం..
● అవస్థలు పడుతున్న జనం

కొడవలూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. మురుగు కాలువలు, గుంతలకు నిలయంగా మారాయి. దీంతో దోమలు బెడద అధికమైంది. దోమల నివారణకు ఉపయోగించాల్సిన ఫాగింగ్ యంత్రాలు మూలపడడంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. కొడవలూరు, రాజుపాలెం, మానేగుంటపాడు, రేగడిచెలిక, యల్లాయపాలెం, ఆలూరుపాడులతోపాటు మండలంలోని 24 పంచాయతీల్లో 19 ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటికి మరమ్మతులు చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. నిర్వహణ సరిగా లేకపోవడంతో ఫాగింగ్ ప్రక్రియ జరగడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం ఒక్కో యంత్రాన్ని రూ.30 నుంచి రూ.40


అపరిశుభ్రంగా ఉన్న డ్రైనేజీ

వేలు పెట్టి కొనుగోలు చేసింది. అయితే ఇంధనానికి నిధులు మంజూరు చేయకపోవడంతో యంత్రాలు మూల పడ్డాయి. వెంటనే వీటిని అందుబాటులోకి తీసుకొచ్చి దోమలు బెడదను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు కాలువల్లో పూడిక తీయకపోవడం, చెత్త తొలగించకపోవడంతో దోమకాటుతో విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని వారు కోరుతున్నారు.

ఎర్రగుంట సమస్యలు పరిష్కరించండి సార్!

● చెట్ల కొమ్మలతో కుంచించుకుపోయిన వీధులు

వెంకటాచలం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చవటపాళెం పంచాయతీ ఎర్రగుంట గ్రామంలోని పలు వీధులు చెట్ల కొమ్మలతో కుంచించుకుపోయాయి. చెట్లు చొచ్చుకుని రావడంతో కొన్ని వీధులు కొంతవరకు కుదించుకెళ్లాయి. దీంతో ప్రజలు, వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు గ్రామస్థులు మండల, గ్రామ స్థాయి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా వారు స్పందించలేదు. వీధుల్లోకి చొచ్చుకొచ్చిన కొమ్మలను ఎవరైనా కత్తిరిస్తే గొడవలకు వస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధుల్లోకి చొచ్చుకొచ్చిన చెట్ల కొమ్మలను కత్తిరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎమ్మెల్యే కురుగొండ్ల జన్మదిన వేడుకలకు

భారీగా తరలిన టీడీపీ నేతలు

సైదాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు గురువారం మండల టీడీపీ నాయకులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణతో కేక్ కట్ చేయించి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి మండల అభివృద్ధికి ఎమ్మెల్యే రామకృష్ణ శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షుడు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, తుమ్మలతలుపూరు గ్రామం క్లస్టర్ ఇన్‌చార్జి పెమ్మసాని దిలీప్ చౌదరి, రామసాగరం మాజీ సర్పంచు అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సైదాపురం : ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

● **వేడుకల్లో పాల్గొన్న రాపూరు టీడీపీ నాయకులు**

రాపూరు: వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాపూరు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు దందోటి వెంకటేశ్వర్లురెడ్డి, తిరుపతి పార్లమెంటు వాణిజ్య ప్రధాన కార్యదర్శి టీఎన్ ప్రసాద్‌నాయుడు, టీడీపీ యువ నాయుడు చెన్న అశోక్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇందులో ప్రసాద్‌నాయుడు, చెన్ను అశోక్‌రెడ్డి రక్తదానం చేశారు. టీఎన్ ప్రసాద్ మండల కార్యకర్తలతో కలిసి గజమాల వేసి శాలువాతో కురుగొండ్ల రామకృష్ణను సత్కరించి, అనంతరం కేక్ కట్‌చేసి కార్యకర్తలతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రాపూరు టీడీపీ నాయకులు నువ్వుల శివరామకృష్ణ, పచ్చిగళ్ల రత్నం, కోటి నాయుడు, ఖాజామోహిద్దీన్, నల్లవడ్ల వెంకటరమణరెడ్డి, మధురెడ్డి, ఖాజా మొహిద్దీన్, తదితర నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కలువాయి : కలువాయిలోని యాదవపాళెంలో గురువారం రాత్రి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు అరిబోయిన సుందరయ్య యాదవ్, కల్యాణ్, కండే శ్రీనివాసులు, పలువురు అభిమానులు పాల్గొన్నారు.


రాపూరు : ఎమ్మెల్యే రామకృష్ణ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

తప్పు చేసిన వారిని వదిలిపెట్టం : ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన ఏ ఒక్కరినీ తమ ప్రభుత్వం వదిలిపెట్టబోదని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల వైసీపీ నేతల చేతిలో హత్యాయత్నానికి గురైన పంటపాలెం టీడీపీ నాయకుడు యదనపర్తి శ్యామ్‌రెడ్డిని గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి పై వాకబు చేశారు. రాష్ట్రాన్ని నేరాలకు నిలయంగా మార్చిన జగన్‌రెడ్డి ప్రవ చనాలు పలుకుతున్నాడన్నారు. కాకాణి రాజకీయ రంగప్రవేశం తర్వాత పరిస్థితులు దారుణంగా మారాయని, పాపాలు పండి శ్యామ్‌రెడ్డిని చంపేం దుకు ప్రయత్నించిన లెనిన్ కొడుకులతో సహా కాకాణి జైలుకెళ్లాడన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, నాయకులు పల్లంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, పల్లంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.


శ్యామ్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

● **బాలరవిని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**

కోవూరు: ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్న టీడీపీ నాయకుడు బాలరవిని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పరామర్శించారు. సత్రంవీధిలోని ఆయన ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. ఆమె వెంట టీడీపీ నాయకులు జెట్టి మదన్‌రెడ్డి, పఠాన్ నజీర్ ఉన్నారు.

రూ. 39 లక్షలతో మంచినీటి ట్యాంకు


ట్యాంకు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మనుబోలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మనుబోలు పంచాయతీలోని యాచవరంలో గురు వారం మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులను ప్రారంభించారు. మను బోలు టీడీపీ అధ్యక్షుడు సాని వెంకటరమణయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 39 లక్షలతో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. యాచవరం గ్రామస్తులు చాలాకాలంగా మంచినీటి ఇబ్బం దులు పడుతుండేవారన్నారు. ఎమ్మెల్యే చొరవతో ఆ సమస్య తీరనున్నదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా జేఈ. కసనానాయక్, టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, రాజాగౌడ్, రాయపాటి కిరణ్, ముంగర విజయభాస్కర్ రెడ్డి, ప్రసాద్, చేరెడ్డి రామిరెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, గుంజి సతీష్, గణేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఏడాది పాలన దేశానికే ఆదర్శం

సైదాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఏడాది రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలన దేశానికే ఆదర్శమని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం అన్నారు. గురువారం మండలంలోని కొమ్మిపాడులో గ్రామ టీడీపీ అధ్యక్షుడు నలమారు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సదాశివం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని బీసీలను దగా చేసిందన్నారు. నిరుద్యోగులను డీఎస్సీ పేరుతో మోసం చేసిందని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. నాయీబ్రాహ్మణుల సంక్షేమం కోసం ఎన్టీ రామారావు 1989లో ఫెడరేషన్ ఏర్పాటు చేస్తే సీఎం చంద్రబాబు కార్పొరేషన్లుగా తీర్చిదిద్దారన్నారు. బీసీలకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎన్‌వీ రాఘవులు, పెంచలయ్య, రాఘవులు యాదవ్, నరసయ్యయాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం

ఎమ్మెల్యే ప్రశాంతిపై విమర్శలు తగదు

విడవలూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షే మం కోసం పాటు పడుతు న్న కోవూరు ఎమ్మెల్యే ప్ర శాంతి రెడ్డిపై విమర్శలు తగదని టీడీపీ నాయకులు పసుమర్తి దయాకర్, ఈ దూరు సురేష్, కొల్లు చిన్న వెంకయ్య, చెముకుల వేణు, శివప్రసాద్ హితవు పలికారు. రాజకీయ ద్వేషంతో విమర్శలు చేస్తే వైసీపీ నాయకులు తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. విడవలూరులో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వేమిరెడ్డి దంపతులను దుర్భాషలాడటం తగదన్నారు. టీడీపీ నాయకులపై ఆరోపణలు చేసేముందు ఆలోచించుకుని మాట్లాడాలని వైసీపీ నాయకులకు వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, పూండ్ల అచ్చుత్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, అలగర వినోద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు స్ఫూర్తితో పని చేద్దాం

కోవూరు, జూలై17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని, ఆయన స్ఫూర్తితో కష్టపడి పని చేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మండల పరిధిలోని ఎన్ఎస్ఆర్ కాలనీ, నందలగుంట, పాటూరు గ్రామాల్లో ఆమె గురువారం 'సుపరిపాలలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏ సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఆమె ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో తట్టెడు మట్టికూడా గతుకుల రోడ్లపై చల్లలేదన్నారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమం లో పెన్నాడెల్టా చైర్మన్ జెట్టి రాజ గోపాలరెడ్డి, ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, సర్పంచు యాకసిరి విజయ, టీడీపీ నాయకులు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, జానకిరామయ్య, విజయారెడ్డి, గాది రాజు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కోవూరు : వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

● **బుచ్చిరెడ్డిపాళెం :** నగర పంచాయతీలోని 13, 18వార్డుల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 18వవార్డు పరిధిలోని మంగలికట్ట జగనన్న కాలనీవాసులు సమస్యలపై ఎమ్మెల్యే ముందు వాపోయారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, టీడీపీ నేతలు గుత్తా శ్రీనివాసులు, కిషోర్, కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ డబ్బు జగన్ ఖాతాలోకే

వెంకటాచలం : గత వైసీపీ ప్రభుత్వంలో లిక్కర్ స్కామ్ డబ్బం తా జగన్‌రెడ్డి ఖాతాలోకే చేరినట్లు తేలిపోయిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్ప ష్టం చేశారు. కసుమూరు పంచా యతీ శ్రీరామపురం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయ న శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా జగన్ మోహన్ రెడ్డి పాలనలో చేసిన పాపాలే ఇంకా కనిపిస్తున్నాయన్నారు. లిక్కర్ స్కామ్ రూ.3200 కోట్ల లో బాస్ ఖాతాలోకి రూ.2900 కోట్లు చేరినట్లు తేలిందన్నారు. శ్రీరామపురం గ్రామంలో నిర్వహించిన 'సుపరి పాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. శ్రీరామపురం అంటేనే జాతీయస్థాయిలో ఒక బ్రాండ్ అని, ఇది పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్వగ్రామమన్నారు. వెంకయ్య చొరవతోనే ఈ ప్రాంతానికి కేంద్ర సంస్థలు, పథకాలు వచ్చాయన్నారు. టీడీపీ మండలాధ్య క్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, ఎంపీడీవో కల్పన, నేతలు బొమ్మి సురేంద్ర, రావూరి రాధాకృష్ణమ నాయు డు, చల్లా నాగార్జున్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి అల్లూరు ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

C.R.I.M.E N.E.W.S

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

కొండాపురం, జూలై17 (ఆంధజ్యోతి): మండలంలోని సాయిపేటలో మనస్తాపంతో గడ్డి మందుతాగి గురువారం ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు, కలిగిరి మండలం కొత్తూరుకి చెందిన చెరుకూరు రామాంజనే యులు సాయిపేటకి చెందిన రాజేశ్వరిని సుమారు 18 ఏళ్ల వివాహం చేసుకున్నాడు. వీరికి 15 ఏళ్లలోపు ఇద్దరు ఆడ పిల్లలు. కుటుంబ కలహాలతో రాజేశ్వరి ఇద్దరు పిల్లలతో కొంతకాలంగా సాయిపేటలోని తల్లిదండ్రుల వద్దే ఉంటున్నది. ఈ క్రమంలో రామాంజనేయులు మద్యం తాగి అప్పడప్పుడూ ఇంటికివచ్చి గొడవ చేస్తుండేవాడు. ఇలా చేయడం సరికాదని రాజేశ్వరి,ఆమె కుటుంబసభ్యులు అనడంతో మనస్తాపం చెంది, బుధవారం గడ్డిమందు తాగాడు. 108లో కొండాపురం పీహెచ్‌సీకి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అనంతరం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యుడి సూచనలతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. భార్య రాజేశ్వరి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాల్యాద్రి తెలిపారు.

నాలుగు ఆలయాల్లో చోరీ

పొదలకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగళ్లూరులో గురువారం తెల్లవారుజామున నాలుగు ఆలయాల్లో చోరీలు జరిగాయి. గ్రామంలోని మాతమ్మ, భద్రకాళి, రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మాతమ్మ గుడిలో నాలుగున్నర సవర్ల తాళిబొట్టు, ముక్కుపుడక, హుండీని దోచుకెళ్లారు. భద్రకాళి ఆలయంలో అమ్మవారి నాలుగు తాళిబొట్లతో పాటు రామాలయంలో హుండీని తీసుకెళ్లారు. అందులోని నగదును తీసుకుని హుండీని చెరువులో విసిరేశారు. ఆంజనేయస్వామి విగ్రహం దగ్గర ఉన్న హుండీని పగులగొట్టి నగదును దోచుకెళ్లారు. ఆలయాల్లో వరుస దొంగతనాల పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల్లో అమ్మవారి తాళిబొట్లను దొంగలు అపహరించుకువెళ్లడంతో పసుపు కొమ్ములతో తయారు చేసిన మంగళసూత్రాలను భక్తులు అమ్మవార్ల విగ్రహాలకు వేశారు.

లారీని ఢీకొన్న బస్సు.. క్లీనర్ మృతి

కోవూరు, జూలై17 (ఆంధ్రజ్యోతి) : కోల్‌కతా జాతీయరహదారిపై కోవూరు సమీపంలో బెంగుళూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు గురువారం తెల్లవారుజామున లారీని ఢీకొంది. ప్రమాదంలో బస్సు క్లీనర్ నాని(30) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెంగుళూరు నుంచి విజయవాడ వెళుతున్న ఇంటర్‌సిటీ ప్రైవేటు బస్సు కోవూరు సమీపంలో లారీని ఓవర్ టేక్ చేయబోయి వెనుకభాగాన్ని ఢీకొంది. దీంతో బస్సు క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది. క్యాబిన్‌లో ఇరుక్కుని బెంగుళూరు నగరానికి చెందిన క్లీనర్ నాని అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాద ఘటన తెలిసిన వెంటనే ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ట్రాఫిక్ ను క్లియర్ చేసి, క్లీనర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బస్సు డ్రైవరుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

హత్యకేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్


సమావేశంలో మాట్లాడుతున్న కావలి డీఎస్పీ తదితరులు

కావలి, జూలై17 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరిలోని ఆల్ ఖైర్ ఫంక్షన్‌హాల్ భాగస్వామి షేక్ హమీద్ హత్య కేసులో నిందితులైన షేక్ గుంటుపల్లి మహ్మద్ హనీఫ్, షేక్ గుంటుపల్లి మహ్మద్ ఉమర్‌లను గురువారం అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ పీ. శ్రీధర్, ఉదయగిరి సీఐ ఎన్ వెంకట్రావు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం సాయంత్రం వారు విలేకరులకు అరెస్ట్ వివరాలను వెల్లడించారు. ఉదయగిరి ఆల్‌ఖైర్ ఫంక్షన్‌హాల్‌లో షేక్ హమీద్, షేక్ గుంటుపల్లి మహ్మద్ హనీఫ్, షేక్ గుంటుపల్లి ఉమర్ భాగస్వాములుగా ఉన్నారు. మూడేళ్లుగా వారి భాగస్వామ్యానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలలో ఏర్పడిన వివాదం కారణంగా నెల్లూరు కోర్టులో సివిల్ కేసు విచారణలో ఉంది. ఈ నేపథ్యంలో ఈనెల 11న హమీద్ తన బావమరిది మరి కొందరితో కలిసి ఫంక్షన్‌హాల్‌కు వెళ్లి తలుపులకు తాళం వేసేందుకు ప్రయత్నిం చాడు. సీసీ కెమెరాల ద్వారా ఆ విషయాన్ని గుర్తించిన ఆయన భాగస్వాములు షేక్ గుంటుపల్లి మహ్మద్ హనీఫ్, షేక్ గుంటుపల్లి మహ్మద్ ఉమర్ ద్విచక్ర వాహనంపై అక్కడకు చేరుకుని, హమీద్‌ను చంపి ఫంక్షన్ హాలును తమ ఆధీనంలోకి తీసుకోవాలని పథకం పన్నారు. అందులో భాగంగా ద్విచక్ర వాహనంపై ఫంక్షన్ హాలులోకి ప్రవేశించి వారి వెంట తెచ్చుకున్న కత్తి ,రాడ్‌లతో విచక్షణా రహితంగా హమీద్‌పై దాడి చేయడంతో హమీద్ అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఉదయగిరి సీఐ వెంకట్రావు ఎస్పీ క్రిష్ణక్రాంత్ ఆదేశాల మేరకు కావలి డీఎస్పీ శ్రీధర్ పర్యవేక్షణలో ఉదయగిరి ఎస్‌ఐలతో కలిసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం దుత్తలూరు మండలం వెంకటంపేటలోని హుసేనీ బీఈడీ కళాశాల వద్ద నిందితులిద్దరిని అరెస్ట్‌చేసి హత్యకు ఉపయోగించిన కత్తి, ఇనుపరాడ్,నిందితుల సెల్‌ఫోన్‌లు, వారు ఉపయోగించిన కారు, నేర సమయంలోవారు ధరించిన దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవటంలో సహ కరించిన ఉదయగిరి సీఐ, ఎస్‌ఐలు, సిబ్బందిని కావలి డీఎస్పీ అభినందించారు.

తుఫాన్‌నగర్‌లో పట్టపగలే చోరీకి యత్నం

● నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగింత


నిందితుడు అన్సర్

కావలి రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుఫాన్ నగర్‌లోని షేక్ సుకుమార్ నివాసంలో గురువారం ఒక వ్యక్తి పట్టపగలే చోరీకి యత్నించాడు. స్థానికులు అతన్ని పట్టుకుని రెండో పట్టణ పోలీసులకు అప్పగించారు. సుకుమార్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి, బంధువుల ఇంటికి వెళ్లగా, అదేప్రాంతంలోని ఎఫ్‌సీఐ గోదాముల ప్రాంతానికి చెందిన అన్సర్ తాళం పగల గొట్టి ఇంట్లోకి ప్రవేసించి చోరీకి యత్నించాడు. స్థానికులు గుర్తించి అతడ్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అగ్నిప్రమాదంలో టీ స్టాల్ దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ముత్తుకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ సిలిండర్ లీక్ కావడం వల్ల జరిగిన ప్రమాదంలో గురువారం నేలటూరులో ఓ టీ దుకాణం దగ్ధమైంది. స్థానికుల కథనం మే రకు వివరాలిలా ఉన్నాయి. పుల్లయ్యకు చెందిన టీ స్టాల్‌లో గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఈఐఎల్ థర్మల్ కేంద్రం అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. దీంతో స్వల్ప ఆస్తి నష్టం జరిగింది. సమీపంలోని ఇళ్లకు ప్రమాదం తప్పింది. ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు పుల్లయ్య అధికారులు కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100) : 515

ఆత్మ డీపీడీగా మురళి

నెల్లూరు(వ్యవసాయం), జూలై 17(ఆంధ్రజ్యోతి): నెల్లూరు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టరుగా ఐ మురళిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన పల్నాడు జిల్లా వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, నెల్లూరు డీఆర్‌సీలో ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ మాధవి ఉదయగిరి ఏడీఏగా బదిలీ అయ్యారు.

'రుక్మిణీ కల్యాణం'పై ప్రవచనం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవలాకులతోట రామకృష్ణమిషన్ లో పద్యసారస్వత పరిషత్ నిర్వహిస్తున్న భాగవత ప్రవచన సప్తాహం కొనసాగుతోంది. గురువారం ఆధ్యాత్మికవేత్త పోలవరపు లక్ష్మీనారాయణ రుక్మిణీ కల్యాణ ఘట్టంపై ప్రవచించారు. శాంతి, సౌభాగ్యాలతోపాటు లోక కల్యాణం కోసం ప్రతీ ఒక్కరూ రుక్మిణీ కల్యాణ ఘట్టాన్ని చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో నలుబోలు బలరామయ్య నాయుడు, రామకృష్ణమిషన్ స్వామీజీ హృదయా నందజీ మహా రాజప్, చీమకుర్తి వెంకటేశ్వరరావు, ఆగస్త్యరాజు సుబ్బారావు పాల్గొన్నారు.

అవార్డులు అభినందనీయం

నెల్లూరు(హరనాథపురం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి అవార్డులు అందుకున్న రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణకు భారతసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కే రాజశిఖామణి, కార్యదర్శి షేక్ ఖాసీం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. స్వచ్ఛత అంశాల్లో విజయవాడ, తిరుపతి, గుంటూరు, విశాఖ పట్నం, రాజమండ్రి కార్పొరేషన్లకు అవార్డులు వచ్చిన విషయం విదితమే. వాటిని మంత్రి అందుకున్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

నెల్లూరు(విద్య), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ న్యాయవాది శింగంశెట్టి శ్రీరామ్ అన్నారు. నగరంలోని బాలాజీ నగర్ వికాస్ హైస్కూల్‌లో గురువారం అంతర్జాతీయ జస్టిస్ డే సందర్భంగా న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారతీయ న్యాయ వ్యవస్థ ఎంతో పటిష్టమైనదని చెప్పారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన న్యాయ స్థానం సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ఫైనాన్షియల్ అధికారిగా కోసలరామ్


కోసలరామ్

నెల్లూరు (హర నాథ పురం); జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన కలివే కోసలరామ్ డీసీహెచ్ఎస్‌లో అసిస్టెంట్ ఫైనాన్షియల్ అధికారిగా నియమితులయ్యారు. ఆయన జిల్లా ట్రెజరీ కార్యాలయం లో సబ్ ట్రెజరీ అధికారిగా పనిచేస్తూ ఇటీవల బదిలీల్లో మార్కాపురం సబ్ ట్రెజరీ అధికారిగా బదిలీ అయినారు. కొద్ది రోజులకే అసిస్టెంట్ ట్రెజరీ అధికారి(ఏటీవో)గా ఆయనకు ఉద్యోగోన్నతి లభించింది. అది జిల్లా స్థాయి పోస్టు కావటంతో ఏటీవోతో సమాన హోదా కలిగిన నెల్లూరులోని డీసీహెచ్ఎస్‌లో అసిస్టెంట్ ఫైనాన్షియల్ అధికారిగా నియమితులైనారు. ఆయనకు ట్రెజరీ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. కోసలరామ్ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేత్రదానం

నెల్లూరు (వైద్యం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన చెరుకూరు రామాంజనేయులు(42) మృతిచెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. నేత్రదాన మోటివేటర్ మక్కెన అంకయ్య చౌదరి సహకారంతో ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ మృతుని నేత్రాలను సేకరించారు.

నేడు సాహిత్య వేదిక

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సాహిత్య అకాడమీ, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా శుక్రవా రం సాహిత్య వేదిక నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమం దర్గామిట్టలోని డీకే మహిళా కళాశాలలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 25 సంవత్సరాల తెలుగు సాహిత్యం - ఒక పరిశీలన (2001-2025) అనే అంశంపై ఉపన్యాసాలు, పత్ర సమర్పణ జరుగుతాయని తెలిపారు. వచన కవిత్వంపై పెరుగు రామకృష్ణ, బాల సాహిత్యంపై గంగిశెట్టి శివకుమార్, కథా సాహిత్యంపై కే కరుణశ్రీ ఉప న్యసిస్తారని, రచయితలు, కవులు, సాహితీవేత్తలు, విమర్శకులు హాజరుకావాలని కోరారు.

20న అడికృత్తిక పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 20న అడికృత్తిక పూజలు జరుగుతాయని ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. ఆ రోజు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విశేష అభిషేకాలు, 10 గంటలకు నెమలి వాహనంపై వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పేట ఉత్సవం జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

రేపు సాహిత్య,చారిత్రక విశ్లేషణ

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 17 (ఆంధ్రజ్యోతి) : చేతన సంగీత , సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో శనివారం సాహిత్య చారిత్రక విశ్లేషణ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు వై శేష గిరీషం, డాక్టర్ ఎం సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం వర్ధమాన సమాజం హాలులో సాయంత్రం 6.30 గంటలకు జరుగుతుందని తెలిపారు. ఆంధ్ర భోజుడు శ్రీకృష్ణదేవరాయలు, అష్టదిగ్గజ కవులపై ఆచార్య పాయసం సుబ్రహ్మణ్యం మహర్షి సాహిత్య, చారిత్రక విశ్లేషణ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సాహిత్య అభిమానులు అందరూ తరలిరావాలని కోరారు.



చెట్లను తొలగించకుండా అటు.. ఇటు అభివృద్ధి చేసిన రహదారి









చెట్టు.. చుట్టూ..!!

● వృక్షాలు నరికేయకుండా నిర్మాణాలు

చిన్న చిన్న అవసరాలకు కూడా బాధ్యతారహితంగా వృక్షాలను నరికేస్తున్న ఈ రోజుల్లో నగరంలో కొందరు చెట్లను కాపాడుకుంటున్నారు. బాగా ఎదిగిన చెట్లను కొట్టేయకుండా వాటి చుట్టూ నిర్మాణాలను చేపట్టి సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు. కొందరైతే దుకాణాల్లో వృక్షాలనూ భాగం చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. వీటి వల్ల పచ్చదనంతోపాటు చల్లటి నీడను కూడా ఆస్వాదిస్తున్నారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

పారిశుధ్య పనులను కాంట్రాక్టర్‌కి ఇవ్వొద్దు

● మున్సిపల్ కార్మికుల నిరసన ప్రదర్శన



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

నెల్లూరు (వైద్యం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థలో పారిశుధ్య పనులను కాంట్రాక్టర్‌కు అప్పగిస్తూ పిలిచిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు గురువారం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు ఈ ప్రదర్శన సాగింది. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సీఐటీయూ నెల్లూరు నగర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ నగరంలోని మలినాలు, వర్థాలు అనేక వైరస్‌లను తమ చేతులతో శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న మున్సిపల్ కార్మికుల పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించటం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికే ఇంజనీరింగ్ కార్మికులు అతి తక్కువ వేతనాలకు పని చేస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వెంటనే వారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సీఐటీయూ రూరల్ కార్యదర్శి పెంచల నర్సయ్య, అజీజ్, సుధాకర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి స్మృతివనం... ప్రభుత్వానికి ఆర్యవైశ్యుల కృతజ్ఞతలు


చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న దర్శి హరికృష్ణ తదితరులు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధానిలో అమరజీవి స్మృతివనం ఏర్పాటు, అందులో 58 అడుగుల ఎత్తైన పొట్టిశ్రీరాములు విగ్రహం నిర్మాణానికి ప్రభుత్వం 6.8 ఎకరాల భూమిని కేటాయించినందుకు నగరంలోని ఆర్యవైశ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పెద్దబజార్ సెంటర్లో వ్యాపారులు, పొట్టి శ్రీరాములు అభిమానులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటా నికి పాలాభిషేకం చేశారు. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దర్శి హరికృష్ణ, పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిపై హత్యాయత్నం కేసులో రౌడీషీటర్‌ను వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఆ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు నిందితుని వివరాలను విలేకరులకు వెల్లడించారు. పాత గొడవల నేపథ్యంలో బుజబుజనెల్లూరుకు చెందిన నూరుద్దీన్‌పై ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన దేవా, రసూల్, రౌడీషీటర్ తన్వీర్, శ్రీను మారణాయుధాలతో విక్షణరహితంగా దాడి చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు అప్పట్లో వేదాయపాలెం పోలీసులు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ముగ్గురు నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేయగా పరారీలో ఉన్న తన్వీర్ కోసం గాలిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్ఐ ముత్యాలయ్య గురువారం ఆ నిందితుడిని ఆర్టీసీ కాలనీ వద్ద అరెస్ట్ చేశారు. బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో దొంగలించిన బైక్, కత్తిని అతని నుంచి స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

స్విమ్మింగ్ కోచ్ అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : చిన్నారి మృతికి కారణమైన స్విమ్మింగ్ కోచ్‌ను గురువారం దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని సప్తగిరి లేవుట్‌లో వంశీకృష్ణ, ఆదిలక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. వారి కుమార్తె(9) ఈత నేర్చుకు నేందుకు ఈ ఏడాది మార్చి 26వ తేదీన తల్లిదండ్రులు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్ కాంప్లెక్స్‌లో ఫీజు చెల్లించారు. 27వ తేదీన కుమార్తెను తీసుకుని స్విమ్మింగ్ పూల్ వద్దకు వెళ్లారు. ఏమైందో తెలియదుగానీ స్విమ్మింగ్ చేస్తుండగా చిన్నారి మృతి చెందింది. స్విమ్మింగ్ కోచ్ నాగరాజు, అక్కడున్న వారి నిర్లక్ష్యంతోనే కుమార్తె మృతి చెందిందని అప్పట్లో బాధిత తల్లిదండ్రులు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు స్విమ్మింగ్ కోచ్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ కే రోశయ్య కేసు విచారణ చేపట్టారు. గురువారం కోచ్ నాగరాజును అరెస్టు చేశారు.

పారిశుధ్య వాహనాలన్నింటినీ వినియోగంలోకి తీసుకురండి : కమిషనర్


వాహనాలను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పారిశుధ్య విభాగానికి కేటాయించిన ప్రతీ వాహనాన్ని వినియో గంలోకి తీసుకురావాలని కమి షనర్ నందన్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం 42వ డివిజన్ కుక్కలగుంట వద్దనున్న వాహనాల షెడ్డును ఆయన పరిశీలించారు. అక్కడున్న వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మినీ ఆటోలు, ట్రాక్టర్లు, స్వీపింగ్ మిషన్లు, కంప్యాక్టర్లు.. ఇతర వాహనాల న్నింటినీ పూర్తిగా సద్వినియోగం చేసుకునే విధంగా తయారు చేయాల న్నారు. చిన్న మరమ్మతులుంటే సరి చేసి చెత్త సేకరణకు వినియోగించాలని సూచించారు. కాగా, కార్పొరేషన్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై శిక్షణ పొందిన బీఎల్వోలతో కమిషనర్ మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో నేర్చుకున్న అంశాల ద్వారా సమగ్రమైన ఓటరు జాబితా తయారీ కి కృషి చేయాలని సూచించారు.

డెంగ్యూ నివారణ చర్యలు తీసుకోండి

● మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ


మాట్లాడుతున్న మలేరియా నివారణ అధికారి హుస్సే నమ్మ

నెల్లూరు (వైద్యం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డెంగ్యూ వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. గురువారం నగరంలోని రామ్మూర్తి నగర్, జనార్దన్‌రెడ్డి కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. జాతీయ డెంగ్యూ నివారణ మాసోత్సవాలలో భాగంగా ప్రజలకు వ్యాధిపై అవగా హన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. లార్వా సర్వే, ఫీవర్ సర్వేలను సక్రమంగా నిర్వహించాలని, జ్వరాలను గుర్తించిన ప్రాంతాలలో రక్తపూతలు తీసి పరీక్షిం చాలని సూచించారు. ఏపీ హెల్త్ యాప్ కొత్త వెర్షన్‌లో ఫొటోలు అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సూపర్వైజర్లు, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

మేం చెప్పినోళ్లకే!

(5వ పేజీ తరువాయి)

అందరికీ అనుమానాలు వస్తున్నాయి. కొంతమంది నాయకులు అవసరం లేకపోయినా అధికార దర్పం ఉపయోగించి వందల బస్తాలు ఇళ్లకు తరలిస్తున్నారు. మరికొంత మంది పంట సాగు చేపట్టకపోయినా వచ్చే సీజన్‌కు ఉంటాయని ముందు జాగ్రత్తగా తరలిస్తున్నారు. దీంతో చిన్న, సన్నకారు రైతులకు యూరియా అందడం లేదు. అయినా అదనపు కోటా కింద యూరియా బస్తాలను జిల్లాకు తీసుకొస్తున్నా ఆ నాయకులకు సమాచారం అంది, తమ వైపు మళ్లించుకుంటున్నారు.

● తీవ్ర ఒత్తిడిలో ఎంఏవో, వీఏఏలు

అధికార పార్టీ నాయకులు యూరియాను తరలించుకుపోతుండటంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు, రైతులు మండల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులను తీవ్రస్థాయిలో ప్రశ్నిస్తున్నారు. తాము ఏం చేయమంటారని బతిమలాడుకునే పరిస్థితి నెలకొంది. అధికారపార్టీ నాయకులను ప్రశ్నిస్తే ఏమవుతుందోనన్న ఆందోళన, మరోవైపు చిన్న, సన్నకారు రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.

● ముందుగా నగదు చెల్లిస్తేనే...

గతంలో మండల వ్యవసాయ అధికారులు, వీఏఏలు వారి పరిధిలో ఎంత మేర విస్తీర్ణం ఉంది.. ఎన్ని ఎకరాల్లో పంటలు సాగవుతాయని ఒక అంచనా వేసి ముందుగానే ఎరువులను తెప్పించి గోదాముల్లో ఉంచేవారు. అవసరమైన రైతులు వచ్చి పొలం పత్రాలు, ఆధార్ చూపించి నగదు చెల్లించి ఎరువులు తీసుకెళ్లేవారు. అయితే ప్రస్తుతం ఆ పద్ధతికి స్వస్తి పలికారు. రైతులు ముందుగా నగదు చెల్లించిన తరువాత వీఏఏలు మార్క్‌ఫెడ్‌కు ఇండెంట్ పెడతారు. రెండు, మూడు రోజులకు రైతు సేవా కేంద్రం వద్దకు లోడ్ వస్తుంది. ఆ తర్వాతే రైతులకు పంపిణీ చేస్తారు. మార్క్‌ఫెడ్‌కు బకాయిల బెడద లేకుండా ఉండేలా ఈ పద్ధతి తీసుకొచ్చారు. అయితే దీన్ని కొంత మంది నాయకులు దుర్వినియోగం చేస్తున్నారు. లారీ లోడ్‌కు వారే ముందుగా నగదు చెల్లించి తీసుకెళ్లిపోతున్నారు.

● ప్రైవేటులో అధిక ధరలు

వరినాట్ల తరువాత కేవలం 40 రోజుల్లోనే యూరియాతో అవసరం ఉంటుంది. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు అదనపు ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు. అదేమిటని ప్రశ్నిస్తే స్టాక్ లేదనే మాట కూడా చెబుతున్నారు. ఇంకొంత మంది యూరియాతోపాటు డీఏపీ, ఇతర పురుగు మందులు కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టంగా చెబుతున్నారు. ఒక్కో బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకు అదనంగా వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. అయితే వీటిపై రైతులు అధికారులకు సూచన ప్రాయంగా సమాచారం ఇస్తున్నారే తప్ప ఫిర్యాదు మాత్రం చేయడం లేదు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

40వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచాం

జిల్లా అవసరాలకు మించి అదనంగా యూరియాను అందుబాటులో ఉంచాం. ఇప్పటివరకు దాదాపుగా 40వేల మెట్రిక్ టన్నులు అమ్మకాలు జరిగాయి. అందులో సగం సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఇవ్వడం జరిగింది. వ్యవసాయశాఖ అధికారులు సిఫార్సు చేసిన దానికంటే ఎక్కువగా రైతులు యూరియాను వినియోగిస్తున్నారు. దీనివల్ల చీడపీడలు పెరిగే అవకాశం ఉంది. ఎకరాకు 135 కేజీలు మూడు దఫాలుగా వాడితే సరిపోతుంది. వ్యాపారులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

21 చలో విజయవాడ

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ కిషోర్



చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

నెల్లూరు (జడ్పీ), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగులు, కార్మి కుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ శంకర్ కిషోర్ తెలిపారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించి చలో విజయవాడ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనాలను బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లించాలని కోరారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసీ) ఆధ్వర్యంలో జరగనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో మీటర్ రీడర్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హజరత్ వలి, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కృష్ణ, మహిళ కో కన్వీనర్ శిరీష, సంతోష్, ఫిరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తసేకరణలో ఉత్తమ అధికారిణిగా సిద్దేశ్వరి

అల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : చెత్తసేకరణలో ఉత్తమ అధికారిణిగా మండలంలోని పురిణి గ్రామ కార్యదర్శి సిద్దేశ్వరి ఎంపికయ్యారు. గురువారం డీపీవో ఎల్ శ్రీధరరెడ్డి నుంచి ఆమె ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. పురిణిలో తడి చెత్తను వారానికి రెండు దఫాలుగా సేకరించి వర్మీ కంపోస్టును తయారు చేసి పంచాయతీకి ఆదాయాన్ని చేకూర్చడంతోపాటు పొడిచెత్తను కూడా సక్రమంగా సేకరించి పంచాయతీకి ఆదాయాన్ని రాబట్టారు. ప్రజాభిప్రాయం మేరకు ఆమెను ఎంపిక చేసినట్టు ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర తెలిపారు.

పార్కులతో ప్రజలకు ఆహ్లాదం : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


పార్కులో అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరణలో రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, నాయకులు

నెల్లూరు రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు పార్కులే ఆహ్లాదం, మనశ్శాంతినిస్తాయని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం 21వ డివిజన్ రవీంద్రనగర్‌లో రూ.15 లక్షలతో పార్కు పనులను ఆయన ప్రారంభించారు. నగరంలో సీసీరోడ్లు, కల్వర్టులే కాకుండా, పార్కులపైనా దృష్టి సారించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బారా షహీద్ దర్గాలో త్వరలో మసీదు నిర్మాణం

● ఎన్‌సీసీ అధికారులతో అబ్దుల్ అజీజ్ సమీక్ష

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బారాషహీద్ దర్గాలో షాహీ మస్జిద్ నిర్మాణంపై ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్, టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ గురువారం ఎన్‌సీసీ అధికారులతో చర్చించారు. హరనాథపురంలోని ఆయన నివాసంలో ఈ సమీక్ష సమావేశం జరిగింది. మసీదు ప్లాన్, ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, వచ్చే రొట్టెల పండుగ నాటికి మసీదును పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని చెప్పారు. ఈ మసీదు రాష్ట్రానికే తలమానికంగా ఉంటుందని తెలిపారు.


మసీదు ప్లాన్‌ను పరిశీలిస్తున్న అజీజ్

లాడ్జీల్లో పోలీసుల తనిఖీ



నెల్లూరు(క్రైం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో భాగంగా బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు నెల్లూరులోని పలు లాడ్జీల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. ప్రతీ గదిని క్షుణ్ణంగా పరిశీలించి, వాటిలో బస చేసిన వారి వివరాలు సేకరించారు. లాడ్జీల్లో దిగిన వ్యక్తుల ఆధార్ వివరాలతో పాటు పూర్తి సమాచారంతో రిజిస్ట్రేషన్ చేయాలని, ఆ వివరాలను సంబంధిత స్టేషన్‌కు అందజేయాలని నిర్వాహకులకు సూచించారు.

చేపలు పట్టేద్దాం!

- సోమశిల డ్యాంలో నిబంధనల ఉల్లంఘన
- స్థానికేతరుల ద్వారా వేట సాగిస్తున్న అక్రమార్కులు
- మౌనం దాల్చుతున్న మత్స్య శాఖ



జలాశయం ఎగువున వేట సాగిస్తున్న మత్స్యకారులు

అనంతసాగరం జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయం రైతులకే కాదు.. వందలాది జాలర్ల కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తోంది. అయితే, ఏడాదిలో మూడు మాసాలు చేపల వేటకు విరామం ఉంటుంది. అది కూడా చేపల ఉత్పత్తి కోసమే.. కాగా కొందరు వ్యాపారులు మాఫియాగా ఏర్పడి నిబంధనలు ఉల్లంఘించి అక్రమవేటను పోత్సహిస్తూ మత్స్యకారుల కడుపు కొడుతున్నారు. సోమశిల డ్యాం పరిధిలో వివిధ రకాల జాతుల చేపలు లభిస్తాయి. ఎర్రగండి, నల్లగండి, మూస, బొచ్చె, వాలుగ.. చిన్న రకాల్లో అరుజులు, బొమ్మిడాయి, ఇసుకదందులు, నాటురొయ్యలు దొరుకుతాయి. సాధారణ సమయంలో సుమారు 1000 మంది వరకు చేపలవేటతో జీవనం పొందుతారు. జలాశయం పరిధిలో ఎగువన కొంత దూరం మాత్రమే నెల్లూరు సరిహద్దు ప్రాంతం ఉంటుంది. ఆ తర్వాత కడపజిల్లా పరిధిలోకి వస్తుంది. ప్రస్తుత సీజన్‌లో చేప గుడ్డుదశలో ఉంటుంది కాబట్టి ప్రభుత్వం వేటవిరామం ప్రకటించింది. జూలై 1 నుంచి మూడు మాసాలు వేటజోలికి వెళ్లరాదు. అయితే కొందరు వ్యాపారులు స్థానికేతరులను రంగంలోకి దింపి లోతట్టు ప్రాంతాలకు పంపించి అక్రమవేట జరుపుతూ రాత్రిపూట మత్స్య సంపదను ఇతర రాష్ట్రాల మార్కెట్లకు తరలిస్తున్నారు. ఈ తరహా దోపిడీ వల్ల రాబోవు రోజుల్లో తమకు వేట జరగక ఇబ్బందులు పడతామని సామాన్య మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమవేటపై నిఘా ఉంచి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆర్థిక మోసాలపై అవగాహన అవసరం

- ఆర్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ సుబ్బయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ సుబ్బయ్య

నెల్లూరు(హరనాథపురం), జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరమైన మోసాల గురించి ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ సుబ్బయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో యాక్సిస్ బ్యాంకు ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆర్థిక మోసాలను తెలుసుకోవటం, వాటిని నివారించేందుకు వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డీఆర్వో హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు ఇలాంటి సమావేశాలు అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ కల్యాణ్ చక్రవర్తి, ఎల్‌డీఎం మణిశేఖర్, ఆర్బీఐ ఏజీఎం బాలతేజ, యాక్సిస్ బ్యాంకు సీనియర్ ఉపాధ్యక్షులు సంగీత సింగ్, చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా వెంగమాంబ నెల పొంగళ్లు

- అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



దుత్తలూరు (ఉదయగిరి), జూలై 17 (ఆంధ్రజ్యోతి): నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి నెల పొంగళ్ల ఉత్సవం గురువారం కనులపండువగా జరిగింది. వెంగమాంబ బ్రహ్మోత్సవాల్లో అమ్మవారి కల్యాణ జరిగిన నెల రోజుల తరువాత వచ్చే మొదటి గురువారం ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయ పండితులు వెంగమాంబ దంపతులను, ఆలయ గర్భగుడిని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. జిల్లా నుంచేగాక కడప, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో అధికసంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం చెల్లించి మొక్కులు తీర్చుకొన్నారు. సంతానంలో లేని ఆలయంలో అమ్మవారి ముందు వరపడ్డారు. హోమ గుండం చుట్టూ ప్రదక్షణలు చేసి కొబ్బరి వేశారు. తెల్లవారుజామున వేదపండితులు అమ్మవారికి హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ కరుణాకర్, ఈవో వెట్టిగుంట ఉషశ్రీలు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐలు ఆదిలక్ష్మి, రఘునాథ్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆషాడ మాస సారె సమర్పణ

ఆషాడ మాసం సందర్భం గా వెంగమాంబ పేరంటాలుకు సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవిరజానందస్వామిజీ, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సహ కన్వీనర్ మాలేపాటి స్రవంతిల ఆధ్వర్యంలో జనార్దన స్వామి ఆలయం నుంచి మహిళలు భారీ సంఖ్యలో సారె తీసుకుని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈవో ఉషశ్రీ, బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, కదిరి వెంకట రంగరావు, చుండి హరిగోపాల్‌రెడ్డి, పెసల కృష్ణ, కర్రా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న చిన్నారుల కోలాట ప్రదర్శన

ప్రభుత్వ స్థలంలో సైడ్‌రూమ్



ప్రభుత్వ స్థలం ఆక్రమించి ఏర్పాటు చేసిన పందిరిలో మద్యం సేవిస్తున్న మందుబాబులు

- బరితెగించిన మద్యం దుకాణదారు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- బహిరంగంగా మద్యం సేవిస్తున్నా పట్టించుకోని పోలీసులు

కావలి,జూలై17(ఆంధ్రజ్యోతి): కూతవేటు దూరంలో పోలీస్‌స్టేషన్... అంతే దూరంలో మున్సిపల్ కార్యాలయం... అయితే ఆ రెండు శాఖల అధికారులను ఎలా మేనేజ్ చేసారో తెలియదుకానీ... కావలి నడిబొడ్డున ఓ మద్యం దుకాణదారు ప్రభుత్వ స్థలం ఆక్రమించి సైడ్‌రూమ్ ఏర్పాటు చేశారు. అంతేకాక యథేచ్ఛగా మద్యం సేవింప చేస్తున్నా వారు పట్టించుకోవటంలేదు. వాస్తవంగా దుకాణదారు మద్యం సీసాలు అమ్ము కోవాలేకానీ, అక్కడే కూర్చోపెట్టి మద్యం తాపించకూడదనేది ప్రభుత్వ నిబంధన. అయితే ఆ నిబంధనను తుంగలో తొక్కి పట్టణ నడిబొడ్డున పొట్టి శ్రీరాములు విగ్రహం సాక్షిగా, వరవ కాలువపై వేసి ఉన్న శ్లాబ్‌మీదున్న చిరు వ్యాపారాలను తరిమేశారు. తనకున్న పలుకుబడితో ఆస్థలాన్ని ఆక్రమించాడు. అక్కడ ఒక పెద్ద బంకును, దానికి ఎదురుగా పందిరి వేసి చుట్టూ కనిపించకుండా ఫ్లెక్సీలు అడ్డంపెట్టి మద్యం సేవించే వారికి సైడ్‌రూమ్‌ను ఏర్పాటు చేశాడు. ఆ దుకాణంలో మద్యం కొనుక్కొని అక్కడే సేవిస్తుండటంతో ప్రజలు ఏంట్రా ఇంత దిగజారిపోయిందా వ్యవస్థ ? అంటూ చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులకు ఏ స్థాయిలో నెలవారీ మామూళ్లు ముడుతున్నాయో అర్థం కావటంలేదని వారంటున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందించి, ఆ ఆక్రమణలను తొలగించి అక్కడ మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



షాపు నిర్వాహకులు ఏర్పాటు చేసిన బంకు

ఆక్రమణలు తొలగిస్తాం...

వరవ కాలువపై మద్యం దుకాణదారుడు ఆక్రమించి సైడ్‌రూమ్ లాగా ఏర్పాటు చేసుకున్న విషయం ఇటీవలే తన దృష్టికి వచ్చింది. అక్కడ ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈమేరకు టౌన్ ప్లానింగ్ వారికి ఆదేశాలు కూడా ఇచ్చా.

-జీ. శ్రావణకుమార్, మున్సిపల్ కమిషనర్

చేపల పెంపకంపై 21 నుంచి శిక్షణ

నెల్లూరు(వ్యవసాయం), జూలై 17 (ఆంధ్రజ్యోతి): చేప పిల్లల నర్సరీ నిర్వహణపై నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఈనెల 21వతేదీ నుంచి 25వతేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కేవీకే సమన్వయకర్త డాక్టర్ జీ లలితా శివజ్యోతి, మత్స్య విభాగం శాస్త్రవేత్త హరిసాదులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్ప్ చేపల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై 26 నుంచి 31వతేదీ వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు 9154806577 నెంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

భూ సమస్యల ఫిర్యాదులపై జేసీ పరిశీలన

అనంతసాగరం, జూలై 17 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో భూసమస్యల ఫిర్యాదులపై జిల్లా జాయింట్ కలెక్టరు కార్తీక్ గురువారం పరిశీలించారు. ముత్తుకూరు చెరువును ఆక్రమించినట్లు స్థానికులు ఫిర్యాదు చేయగా తొలుత అక్కడకు చేరుకొని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం సంజీవనగరంలో సీజేఎఫ్ భూముల వివాదాన్ని పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, మండల తహసీల్దారు జయవర్ధన్ పాల్గొన్నారు.



భూముల పరిశీలనకు వచ్చిన జేసీ కార్తీక్

‘వెలుగొండ’ను పూర్తి చేసి సాగు, తాగునీటి కష్టాలు తీరుస్తా!

- రాష్ట్ర మంత్రి ఆనం వెల్లడి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి ఆండ్రావారిపల్లి, వరికుంటపాడు గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి ఆనం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆండ్రావారిపల్లిలోని ఏఎంసీ మాజీ చైర్మన్ ఆండ్రా నాగిరెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి నియోజకవర్గంలో 7 ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశానని, మరికొన్ని ఆలయాలకు సైతం ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఆలయాల పునఃనిర్మాణంలో భాగంగా జిల్లాకు రూ.35.61 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఉదయగిరికి సైతం రెండు ఆలయాల పునఃనిర్మాణం దిశగా రూ.3 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలో మరో రెండు ఆలయాలకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. నందవరం-నందిపాడు రహదారి పనులతోపాటు ఆత్మకూరు-సోమశిల రహదారికి సైతం రూ.60 కోట్ల నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. అనంతరం గ్రామాలతోపాటు కాలనీల్లో ఇంటింటికెళ్లి ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకుంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, టీడీపీ నాయకులు చెంచలబాబు, మధుసూదన్‌రావు, శివరామిరెడ్డి, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంచుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్

అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలి

- పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ

కలిగిరి, జూలై17 (ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు అనుమతించిన మేరకు రైతులు పంట సాగుచేయాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ పేర్కొన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. పొగాకు మార్కెట్ తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. లోగ్రేడ్ పొగాకును కొనుగోళ్లు చేయక పోవడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పలువురు రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. లోగ్రేడు పొగాకుకు మద్దతు ధర అందించడంతోపాటు నోబిడ్ శాతాన్ని తగ్గించాలని కంపెనీ ప్రతినిధులను వారు కోరారు. నాణ్యమైన పొగాకు గ్రేడ్‌లను వేలం కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు ఏఎం రామాంజనేయులు, ఆర్ఎం రామారావు, స్థానిక వేలం నిర్వహణాధికారి శివకుమార్, ఫీల్డ్‌ఆఫీసర్ సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న ఈడీ విశ్వశ్రీ, తదితరులు

విద్యార్థి మృతిపై విచారణ జరపాలి

నెల్లూరు(క్రైం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఫార్మసీ విద్యార్థి మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సీమాంధ్ర ఎంఆర్‌పీఎస్ నాయకులు పోలీసులు అధికారులను కోరారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య, మృతుని కుటుంబ సభ్యులు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్యకు వినతిపత్రం ఇచ్చారు. సత్యసాయి జిల్లాకు చెందిన జానా శ్రీకాంత్ నెల్లూరులోని ఓ ఫార్మసీ కళాశాలలో డీఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని చెప్పారు. చదువుకుంటూనే నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాల మందుల దుకాణంలో పార్ట్‌టైం ఉద్యోగం పనిచేస్తున్నాడన్నారు. బుధవారం అదే హాస్పిటల్‌లో విద్యార్థి అకస్మాత్తుగా మృతి చెందాడని, దీనిపై అనుమానాలున్నాయని, సమగ్రంగా విచారణ జరపాలని కోరారు.

సెల్‌ఫోన్ల గజదొంగ అరెస్టు

- ఇద్దరు మైనర్లు కూడా...
- 42 మొబైల్ ఫోన్ల స్వాధీనం

నెల్లూరు(క్రైం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికులు నిద్రలో ఉండగా ఆరి సెల్‌ఫోన్లను అపహరించుకుని వెళ్లే ఫోన్ల గజ దొంగను రైల్వే పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 40 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకు న్నారు. గురువారం నెల్లూరు రైల్వే డీఎస్పీ జీ మురళీధర్ తన కార్యాలయంలో నిందితుడి వివరాలు మీడియాకు వెల్లడిం చారు. గూడూరు పట్టణం దళితవాడకు చెందిన కే అఖిల్ అలియాస్ వెంకట రమణయ్య పాత నేరస్తుడు. ఆయన రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికుల సెల్‌ఫోన్లు చోరీ చేస్తుంటాడు. ఇదిలా ఉండగా నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్ నేతృత్వంలో నెల్లూరు, గూడూరు ఎస్సైలు, సీఐ ఐడీ పార్టీ సిబ్బంది రైళ్లలో నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లో అఖిల్ అనుమానస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని గూడూరుకు తరలించారు. తమదైన శైలిలో విచారించగా పలు రైళ్లలో సెల్‌ఫోన్లు దొంగలించినట్లు అంగీకరించడంతో అరెస్ట్ చేశారు. అతడి నుంచి సుమారు రూ.3 లక్షల విలువ చేసే 40 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నా మని డీఎస్పీ తెలిపారు. ఇదేవిధంగా రైళ్లలో సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడు తున్న మరో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకుమని, వారి వద్దనుంచి రూ.70 వేల విలువ చేసే రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని మైనర్లను హోంకు తరలించామని చెప్పారు. ఈ కేసులో ప్రతిభ కనపరిచిన సీఐ సుధాకర్, ఎస్సైలు హరిచందన, చెన్నకేశవ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రూ.లక్షల వ్యయం.. సేవలు నామమాత్రం!




ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో వృథాగా ఉన్న పరికరాలు

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో అందని సేవలు

ఉదయగిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం జిల్లాలో ప్రతి సచివాలయాలకు అనుసంధానంగా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను నిర్మించింది. ప్రధాన వైద్యశాలలకు తీసిపోనివిధంగా ఈ కేంద్రాలను అన్ని హంగులతో ఏర్పాటు చేసినా అక్కడ వైద్యసేవలు మాత్రం అందని ద్రాక్షలా మారాయి. ఆరోగ్య కేంద్రంలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం అందుబాటులో ఉండి రోగులకు వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టింది. వీటిలో ఆధునాతన వసతులతోపాటు సుమారు 30కిపైగా రక్త పరీక్షలు, ఇతరత్రా పరికరాలను అందుబాటులోకి తెచ్చినా సేవలు మాత్రం సక్రమంగా అందడం లేదని గ్రామీణ ప్రజానీకం వాపోతోంది.

వృథాగా పరికరాలు

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలకు రూ.లక్షలు వెచ్చించి రక్త పరీక్షల పరికరాలు, రోగులను తరలించేందుకు స్ట్రెచర్లు, సెలైన్ స్టాండ్లు, బెడ్‌లు, మందులు, సిరఫ్‌లు, ఇతరత్రా పరికరాలు ఏ ఆరోగ్య కేంద్రంలో చూసినా నిరుపయోగంగానే ఉన్నాయి. కొన్ని కేంద్రాలు వాడుతున్నా పూర్తి స్థాయి ఫలితాలు రావడంలేదు. కొన్ని కేంద్రాలకు సొంత భవనాలు పూర్తి కాకపోవడంతో అద్దె భవనంలో ఆ పరికరాలు మూలకు చేరి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఉదయగిరిలోని సచివాలయం-2 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో శిథిలభవనంలో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది రోగులకు వైద్యసేవలు అందించాల్సి వస్తోంది. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం-1 నిర్మాణం పూర్తయినప్పటికీ భవనం అప్పగించకపోవడం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో సిబ్బంది చీకట్లోనే రోగులకు వైద్యసేవలందిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేసి, ఆరోగ్య కేంద్రానికి విద్యుత్ సౌకర్యం కల్పించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



పీ-4 అందరిదీ !

- వర్క్‌షాపులో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), జూలై 17(ఆంధ్రజ్యోతి) : పీ-4 కార్యక్రమం ప్రభు త్వానిది మాత్రమే కాదని... ఇది ఒక స్వచ్ఛంద కార్యక్రమమని, ప్రజలం దరిదీ అని కలెక్టర్ ఆనంద్ అన్నారు. గురువారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో పీ-4పై వర్క్‌షాపు జరిగింది. ఆయన మాట్లాడుతూ పీ-4 కార్యక్రమంలో ప్రభు త్వ ఉద్యోగులు మాత్రమే కాకండా ఇతరులు కూడా స్వచ్ఛందంగా భాగస్వాములు కావచ్చని చెప్పారు. శాసన సభ్యులు, స్థానిక రాజకీయ నాయకులను కలుపుకుని అధికారులు ఈ కార్యక్రమాన్ని ముందుకు నడపాలని సూచిం చారు. పీ-4పై సందేహాల నివృత్తికి 1800-425-1999 కాల్‌సెంటర్‌ను సంప్ర దించాలని కోరారు. గుర్తించిన బంగారు కుటుంబాలకు అవసరమైన సలహాలు, సంప్రదింపులు, వృత్తి నైపుణ్య త శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీపీవో లక్ష్మీనరసింహులు, నియో జకవర్గాల ప్రత్యేకాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఘనంగా అంకమ్మకు పొంగళ్లు

వింజమూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంకమ్మతోపులో వున్న అంకమ్మకు పొంగళ్లను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ వారు చిరుమామిళ్ల శ్రీనివాసులునాయుడు, గడ్డం రమణయ్య, ఆలా రమణయ్యలు పర్యవేక్షించారు. అలాగే మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9369
వెండి కిలో ధర	రూ. 114200
వెండి ఒక గ్రాము	రూ. 117.20

న్యూస్ బాక్స్

పిల్లల్లో పోషక లోపాలను గుర్తించాలి



పిల్లల ఎత్తును పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను

సీతారామపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో పోషక లోపాలను గుర్తించి వారికి తగిన మోతాదులో ఆహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను సూచించారు. ఆమె గురువారం మండలంలోని పోలంగారిపల్లి, బసినేనిపల్లి, ఏసీ నగర్ అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లలో పోషక లోపాలను గుర్తించేందుకు పిల్లల ఎత్తు, బరువులను సక్రమంగా నమోదు చేయాలన్నారు. మెనూ ప్రకారం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. అలాగే సిబ్బంది సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కిశోర వికాసం ద్వారా బాలికల్లో అవగాహన కల్పించి బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. అనంతరం ముఖాధారిత రేషన్, పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సులోచన, సంపూర్ణ, హుస్సేనీ పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాదారులకు మెరుగైన సేవలు

ఉదయగిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): తపాలా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని పోస్టల్ సూపరింటెండెంట్ కె శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం స్థానిక డివిజన్ తపాలా కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి తపాలా సేవలను డిజిటలైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. 24 నుంచి 25వ తేదీ వరకు రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. అన్ని బీమా కంపెనీల కంటే తపాలా శాఖ ఎక్కువ మొత్తంలో బీమా డబ్బులు మెచ్యూరిటీ కింద అందజేస్తుందన్నారు. ఈ బీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి పోస్టల్ ఇనస్పెక్టర్ వేగూరు సాయికృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ప్రశంసలు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలరేగడ పంచాయతీ కార్యదర్శి నాగరాజు గురువారం నెల్లూరు డీపీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఎల్ శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెమొంటో అందుకున్నారు. సోమగలరేగడ పంచాయతీలోని ప్రజలకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఐవీఆర్ఎస్ కాల్స్‌లో 91 శాతం మంది సమాధానం ఇవ్వడంతో జిల్లాలో ద్వితీయస్థానం నిలిచింది. దీంతో ఆయన్ను డీపీవో అభినందించి ప్రశంసాపత్రం, మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజుకు పలువురు కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

ఆత్మ డీపీడీగా మురళి

● ఉదయగిరి ఏడీఏగా లక్ష్మీమాధవి

నెల్లూరు(వ్యవసాయం), జూలై 17(ఆంధ్రజ్యోతి): నెల్లూరు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టరుగా ఐ మురళిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన పల్నాడు జిల్లా వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, నెల్లూరు డీఆర్‌సీలో ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ మాధవి ఉదయగిరి ఏడీఏగా బదిలీ అయ్యారు.

ఉద్యాన పంటల సాగుపై రైతుల మొగ్గు

● రైతులకు బాసటగా రాష్ట్రప్రభుత్వం

మర్రిపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తూ తెలుగుదేశం ప్రభుత్వం రాయితీలు కల్పిస్తుండడంతో రైతులు ఆయా పంటల సాగుపై మొగ్గు చుపుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఉద్యాన పంటల సాగు మరుగున పడిపోయింది. ప్రధానంగా ఆత్మకూరు నియోజకవర్గంలో నిమ్మ, బొప్పాయి, అరటి, జామ, డ్రాగన్ ఫ్రూట్ వంటి ఉద్యాన పంటల సాగుకు ఇప్పుడిప్పుడే రైతులు ముందుకు వస్తున్నారు. నియోజకవర్గంలోని 6 మండలాల్లో సుమారు 650 మంది వరకు రైతులు ఉద్యాన పంటల సాగుకు మొగ్గు చూపారని, మర్రిపాడు మండలంలో గత ఏడాది 60మంది రైతులు ఈ తరహా పంటలు సాగు చేస్తుండగా ప్రస్తుతం 90 వరకు రైతుల సంఖ్య పెరిగినట్లు అధికారులు చెబుతు న్నారు. సాగునీటి వసతి ఉన్న రైతులు గరిష్ఠంగా రెండు హెక్టార్ల వరకు ప్రయోజనం పొందవచ్చు. రైతుకు 40శాతం వరకు



పాతాలపల్లిలో డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారులు (ఫైల్)

రాయితీ అందిస్తున్నారు. మొక్కల ఖరీదు, సేంద్రియ, రసాయన ఎరువులు, సస్యరక్షణకు రాయితీ కల్పిస్తున్నారు. ఏళ్ల నాటి పండ్లతోటల పునరుద్ధరణలో భాగంగా మామిడి, నిమ్మ వంటి తోటలకు హెక్టారుకు రూ.24వేలు, పండ్లు, పూలతోటలకు రూ. 20వేల చొప్పున రాష్ట్రప్రభుత్వం రాయితీ మంజూరు చేస్తుంది. అలాగే 5నుంచి 10 మంది రైతులు కలిసి కమ్యూనిటీగా ఏర్పడి పంట కుంటలు ఏర్పాటుచేసుకోవచ్చు. అలా ఏర్పడి ఒకే పొలంలో 100మీ పొడవు, 100మీ వెడల్పు, 3మీటర్ల లోతుతో పంట కుంటలు తవ్వుకుంటే ఒక్కోదానికి రూ.18 లక్షలు అందిస్తారు. వ్యక్తిగత పంట కుంటలకు రూ.75వేలు ఇస్తున్నారు. రైతు చేయాల్సిందల్లా రైతుసేవా కేంద్రాల్లోని సహాయకులను సంప్రదిస్తే రాయితీల వివరాలు తెలియజేస్తారు.

దరఖాస్తు చేసుకుంటే చాలు

పండ్లు, కూరగాయలు, పూల తోటలు సాగుచేసే రైతులు దరఖాస్తు అందిస్తే మొక్క నాటినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు వివిధ రాయితీలు కల్పిస్తున్నామని మర్రిపాడు మండల ఉద్యానశాఖ అధికారి రాజశేఖర్ తెలిపారు. రైతులు ముందుకు వస్తే అవగాహన కల్పించి రాయితీలు మంజూరు చేస్తామన్నారు. రాయితీతో పాటు పంట నష్టపరిహారం, బీమా వంటి సౌకర్యాలు ఉంటాయని రాజశేఖర్ తెలిపారు.

సక్రమంగా రేషన్ బియ్యం అందించాలి : ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రేషన్ బియ్యం సక్రమంగా అందించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ డీలర్లకు సూచించారు. స్థానిక తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన డీఎస్‌ఓ ఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి నియోజకవర్గంలోని 8 మండలాల తహసీల్దారులు, డిప్యూటీ తహసీల్దారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ ద్వారా డీలర్లకు అందిన బియ్యాన్ని సక్రమంగా లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

అందించాలని తెలిపారు. గత ప్రభుత్వ విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రెండు, మూడు కాలనీలకు కలిపి ఒక రేషన్ డీలర్ ఉంటే వాటిని వేరుచేసి అందరికీ రేషన్ అందేలా చూడాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో పాల్గొన్న నాయకులు వారి మండలాల్లో సమస్యలను వివరించగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఓ అంకయ్య, డీఎం అర్జున్‌రావు, రెవెన్యూ సిబ్బంది, 8 మండలాల మండల కన్వీనర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల మంజూరు

ఉదయగిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ యువ నాయకుడు తుమ్మల కిరణ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మాసాయిపేట గ్రామంలో టీడీపీ నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా, పాలన ఎలా ఉందని తెలుసుకుని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

● **సీతారామపురం:** గత ఏడాది కాలంగా తెలుగుదేశం ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను, ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించడమే లక్ష్యమని మండల టీడీపీ కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో చింతల అధ్యక్షతన మండల నాయకులు, క్లస్టర్ యూనిట్



ఉదయగిరి : కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు తుమ్మల కిరణ్

ఇన్‌చార్జ్‌లు, మండల బూత్ ఇన్‌చార్జ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది కాలంగా టిడిపి ప్రభుత్వ సుపరిపాలనలో అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించాలని తెలిపారు. అనంతరం స్థానిక



సీతారామపురం: ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

బస్టాండ్ సెంటర్‌లో మండల నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, జాషువా, తమ్మిశెట్టి రమణయ్య, తురక వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు ముత్తుకూరు వెంకటసుబ్బయ్య, తోట మనోజ్, వీకాష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవో కార్యాలయ మరమ్మతు పనుల పరిశీలన



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈ మణికుమార్

ఉదయగిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరుగుతున్న భవన మరమ్మతు పనులను గురువారం పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రూ.27 లక్షలతో శిథిలావస్థకు చేరిన ఎంపీడీవో కార్యాలయ భవనానికి మరమ్మతులు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా భవనానికి స్లాబు వేయనుండడంతో పనులు పరిశీలించామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తిచేయాలని సిబ్బందికి సూచించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపలి, ఏఈ శ్రీనివాసరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి

ఉదయగిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి అదనపు తరగతులు నిర్వహించాలని ఎంఈవో-1 షేక్ మస్తాన్‌వలి సూచించారు. గురువారం పట్టణంలోని నార్త్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన, పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులచే కిట్స్‌కు సంబంధించిన బయోమెట్రిక్ వేయించారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయుల రిజిస్టర్లు పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కప్పా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి

● సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

ఉదయగిరి, జూలై 17 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని శకునాలపల్లి పంచాయతీ పరిధి లోని గ్రామాల్లో గత నాలుగు నెలల క్రితం ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షానికి కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాలని గురువా రం కుర్రపల్లి సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయక పోవడంతో ఖరీఫ్ సీజన్‌లో భాగంగా సాగు చేసిన సజ్జ, ఇతరత్రా పంటలకు నీటి తడులు అందించలేక ఎండుదశకు చేరుతున్నాయని వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయా లని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కాలయాపన చేస్తున్నారని మండి పడ్డారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య, రైతు సంఘం నాయకులు పందిళ్ల వెంకటేశ్వర్లు, రైతులు శ్రీనివాసులు, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ చెన్నారెడ్డి

ఉదయగిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ, రైతు సేవాకేంద్రం సిబ్బంది సమన్వయంతో పని చేసి ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు చర్యలు చేపట్టాలని రీజనల్ టెక్నికల్ అధికారి సీహెచ్ రవిచంద్ర, ఏడీఏ పీ చెన్నారెడ్డిలు సూచించారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని మర్రిపాడు, సీతారామపురం, వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ, రైతుసేవా కేంద్రాల సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. పచ్చిరొట్ట పైర్ల సాగుతో అనేక లాభాలు ఉన్నాయన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై తగు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు రామ్మోహన్, విజయభాస్కర్, మదన్, సునీల్, ప్రకృతి వ్యవసాయ అధికారులు వంశీ, రామ్మోహన్, సురేష్, రోషిణి, కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

నామమాత్రపు వైద్యసేవలపై గ్రామస్థుల నిరసన

ఉదయగిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో 104 వాహనాల ద్వారా నామమాత్రపు వైద్యసేవలు అందించడంపై గురువారం మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కృష్ణారెడ్డిపల్లి గ్రామస్థులు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, ఎంపీటీసీ విజయమ్మలు మాట్లాడుతూ 104 వాహనాలు బీపీ, షుగర్ వ్యాధులకే పరిమితమయ్యాయన్నారు. సచివాలయాల అనుబంధంగా ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు సరైన వైద్యసేవలు అందించకపోవడంతో పేదలు ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు తీసి ఆర్థికంగా



104 వాహనం ఎదుట నిరసన చేస్తున్న గ్రామస్థులు

ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి గ్రామంలో 104 వాహన వైద్యసేవలు సక్రమంగా అందించేలా అధికారులు చర్యలు చేపట్టడంతో పాటు అన్నిరకాల పరీక్షలు నిర్వహించేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

ఉదయగిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి బూత్ లెవల్ అధికారులు సహకరించాలని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళి సూచించారు. గురువారం స్థానిక రైతుసేవా కేంద్రం-1లో మండలంలోని బీఎల్‌వోలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫారం-6, 7, 8 చేర్పులు, మార్పులు, చనిపోయిన, శాశ్వతంగా వెళ్లిపోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించడం తదితర వాటిపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో మురళి

1,200 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న పోలింగ్ బూత్‌లను గుర్తించి విభజించాలన్నారు. అనంతరం బీఎల్‌వోలకు పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ నీహ, శిక్షకులు సలీంబాషా, వెంకటేశ్వర్లు, డీఈవోలు అలీం, సాహెర తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

కొండాపురం, జూలై17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేటలో మనస్తాపంతో గడ్డి మందుతాగి గురువారం ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు, కలిగిరి మండలం కొత్తూరుకి చెందిన చెరుకూరు రామాంజనే యులు సాయిపేటకి చెందిన రాజేశ్వరిని సుమారు 18 ఏళ్ల వివాహం చేసుకున్నాడు. వీరికి 15 ఏళ్లలోపు ఇద్దరు ఆడ పిల్లలు. కుటుంబ కలహాలతో రాజేశ్వరి ఇద్దరు పిల్లలతో కొంతకాలంగా సాయిపేటలోని తల్లిదండ్రుల వద్దే ఉంటున్నది. ఈ క్రమంలో రామాంజనేయులు మద్యం తాగి అప్పడప్పుడూ ఇంటికివచ్చి గొడవ చేస్తుండేవాడు. ఇలా చేయడం సరికాదని రాజేశ్వరి,ఆమె కుటుంబసభ్యులు అనడంతో మనస్తాపం చెంది, బుధవారం గడ్డిమందు తాగాడు. 108లో కొండాపురం పీహెచ్‌సీకి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అనంతరం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యుడి సూచనలతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. భార్య రాజేశ్వరి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాల్యాద్రి తెలిపారు.

నాలుగు ఆలయాల్లో చోరీ

పొదలకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగళ్లూరులో గురువారం తెల్లవారుజామున నాలుగు ఆలయాల్లో చోరీలు జరిగాయి. గ్రామంలోని మాతమ్మ, భద్రకాళి, రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మాతమ్మ గుడిలో నాలుగున్నర సవర్ల తాళిబొట్టు, ముక్కుపుడక, హుండీని దోచుకెళ్లారు. భద్రకాళి ఆలయంలో అమ్మవారి నాలుగు తాళిబొట్లతో పాటు రామాలయంలో హుండీని తీసుకెళ్లారు. అందులోని నగదును తీసుకుని హుండీని చెరువులో విసిరేశారు. ఆంజనేయస్వామి విగ్రహం దగ్గర ఉన్న హుండీని పగులగొట్టి నగదును దోచుకెళ్లారు. ఆలయాల్లో వరుస దొంగతనాల పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల్లో అమ్మవారి తాళిబొట్లను దొంగలు అపహరించుకువెళ్లడంతో పసుపు కొమ్ములతో తయారు చేసిన మంగళసూత్రాలను భక్తులు అమ్మవార్ల విగ్రహాలకు వేశారు.

లారీని ఢీకొన్న బస్సు.. క్లీనర్ మృతి

కోవూరు, జూలై17 (ఆంధ్రజ్యోతి) : కోల్‌కతా జాతీయరహదారిపై కోవూరు సమీపంలో బెంగుళూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు గురువారం తెల్లవారుజామున లారీని ఢీకొంది. ప్రమాదంలో బస్సు క్లీనర్ నాని(30) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెంగుళూరు నుంచి విజయవాడ వెళుతున్న ఇంటర్‌సిటీ ప్రైవేటు బస్సు కోవూరు సమీపంలో లారీని ఓవర్ టేక్ చేయబోయి వెనుకభాగాన్ని ఢీకొంది. దీంతో బస్సు క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది. క్యాబిన్‌లో ఇరుక్కుని బెంగుళూరు నగరానికి చెందిన క్లీనర్ నాని అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాద ఘటన తెలిసిన వెంటనే ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ట్రాఫిక్ ను క్లియర్ చేసి, క్లీనర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బస్సు డ్రైవరుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

హత్యకేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

కావలి, జూలై17 (ఆంధ్ర జ్యోతి): ఉదయగిరిలోని ఆల్ ఖైర్ ఫంక్షన్‌హాల్ భాగస్వామి షేక్ హమీద్ హత్య కేసులో నిందితులైన షేక్ గుంటుపల్లి మహ్మద్ హనీఫ్,




సమావేశంలో మాట్లాడుతున్న కావలి డీఎస్పీ తదితరులు

షేక్ గుంటుపల్లి మహ్మద్ ఉమర్‌లను గురువారం అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ పీ. శ్రీధర్, ఉదయగిరి సీఐ ఎన్ వెంకట్రావు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం సాయంత్రం వారు విలేకరులకు అరెస్ట్ వివరాలను వెల్లడించారు. ఉదయగిరి ఆల్‌ఖైర్ ఫంక్షన్‌హాల్‌లో షేక్ హమీద్, షేక్ గుంటుపల్లి మహ్మద్ హనీఫ్, షేక్ గుంటుపల్లి ఉమర్ భాగస్వాములుగా ఉన్నారు. మూడేళ్లుగా వారి భాగస్వామ్యానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలలో ఏర్పడిన వివాదం కారణంగా నెల్లూరు కోర్టులో సివిల్ కేసు విచారణలో ఉంది. ఈ నేపథ్యంలో ఈనెల 11న హమీద్ తన బావమరిది మరి కొందరితో కలిసి ఫంక్షన్‌హాల్‌కు వెళ్లి తలుపులకు తాళం వేసేందుకు ప్రయత్నిం చాడు. సీసీ కెమెరాల ద్వారా ఆ విషయాన్ని గుర్తించిన ఆయన భాగస్వాములు షేక్ గుంటుపల్లి మహ్మద్ హనీఫ్, షేక్ గుంటుపల్లి మహ్మద్ ఉమర్ ద్విచక్ర వాహనంపై అక్కడకు చేరుకుని, హమీద్‌ను చంపి ఫంక్షన్ హాలును తమ ఆధీనంలోకి తీసుకోవాలని పథకం పన్నారు. అందులో భాగంగా ద్విచక్ర వాహనంపై ఫంక్షన్ హాలులోకి ప్రవేశించి వారి వెంట తెచ్చుకున్న కత్తి ,రాడ్‌లతో విచక్షణా రహితంగా హమీద్‌పై దాడి చేయడంతో హమీద్ అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఉదయగిరి సీఐ వెంకట్రావు ఎస్పీ క్రిష్ణకాంత్ ఆదేశాల మేరకు కావలి డీఎస్పీ శ్రీధర్ పర్యవేక్షణలో ఉదయగిరి ఎస్‌ఐలతో కలిసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం దుత్తలూరు మండలం వెంకటంపేటలోని హుసేనీ బీఈడీ కళాశాల వద్ద నిందితులిద్దరిని అరెస్ట్‌చేసి హత్యకు ఉపయోగించిన కత్తి, ఇనుపరాడ్,నిందితుల సెల్‌ఫోన్‌లు, వారు ఉపయోగించిన కారు, నేర సమయంలోవారు ధరించిన దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవటంలో సహ కరించిన ఉదయగిరి సీఐ, ఎస్‌ఐలు, సిబ్బందిని కావలి డీఎస్పీ అభినందించారు.

తుఫాన్‌నగర్‌లో పట్టపగలే చోరీ యత్నం

● నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగింత

కావలి రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుఫాన్ నగర్‌లోని షేక్ సుకుమార్ నివాసంలో గురువారం ఒక వ్యక్తి పట్టపగలే చోరీకి యత్నించాడు. స్థానికులు అతన్ని పట్టుకుని రెండో పట్టణ పోలీసులకు అప్పగించారు. సుకుమార్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి, బంధువుల




నిందితుడు అన్సర్

ఇంటికి వెళ్లగా, అదేప్రాంతంలోని ఎఫ్‌సీఐ గోదాముల ప్రాంతానికి చెందిన అన్సర్ తాళం పగల గొట్టి ఇంట్లోకి ప్రవేసించి చోరీకి యత్నించాడు. స్థానికులు గుర్తించి అతడ్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అగ్ని ప్రమాదంలో టీ స్టాల్ దగ్ధం

ముత్తుకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ సిలిండర్ లీక్ కావడం వల్ల జరిగిన ప్రమాదంలో గురువారం నేలటూరులో ఓ టీ దుకాణం దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పుల్లయ్యకు చెందిన టీ



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

స్టాల్‌లో గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఈఐఎల్ థర్మల్ కేంద్రం అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. దీంతో స్వల్ప ఆస్తి నష్టం జరిగింది. సమీపంలోని ఇళ్లకు ప్రమాదం తప్పింది. ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు పుల్లయ్య అధికారులు కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 515

చెత్తసేకరణలో ఉత్తమ అధికారిణిగా సిద్ధేశ్వరి



అల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : చెత్తసేకరణలో ఉత్తమ అధికారిణిగా మండలంలోని పురిణి గ్రామ కార్యదర్శి సిద్ధేశ్వరి ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం డీపీవో ఎల్.శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతిని ఆమె అందుకున్నారు. పురిణి గ్రామంలో తడిచెత్తను వారానికి రెండు దఫాలుగా సేకరించి వర్మీ కంపోస్టును తయారు చేసి పంచాయతీకి ఆదాయాన్ని చేకూర్చడం తోపాటు పొడిచెత్తను కూడా సక్రమంగా సేకరించి తద్వారా పంచాయతీకి ఆదాయాన్ని రాబట్టారు. ఈ క్రమంలో ప్రజాభిప్రాయం మేరకు నూరుశాతం ప్రశంసలు అందుకోవడంతో ఆమెను ఎంపిక చేసినట్టు ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర తెలిపారు.

రెండో రోజూ నీటి సరఫరా నిలిపివేత

లింగసముద్రం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం నుంచి రెండోరోజూ గురువారం కూడా అధికారులు మంచినీటి సరఫరాను నిలిపి వేశారు.బుధవారం ఈ పథకానికి చెందిన నీటి ట్రీట్‌మెంటు ప్లాంటును అధికారులు శుభ్రం చేయిస్తున్నారు. రెండోరోజూ కూడా ఈ పనులు కొనసాగాయి.అయితే మధ్యాహ్నం వరకు ప్లాంటును శుభ్రం చేసిన తరువాత ఈ ప్లాంటు నుంచి దుర్వాసన రాకుండా నీటితో మళ్లీ శుభ్రం చేస్తున్నట్టు ఏఈ సీహెచ్ రాజశేఖర్ చెప్పారు.శుక్రవారం ఉదయం నుంచి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు.

164 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 575పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10కంపెనీ ప్రతినిధులు పాల్గొని 411బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-140, ఆర్‌ఆర్-3, సీఆర్-11, జంపింగ్‌లాట్స్-10 కారణాలతో 164బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.199.97గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కందుకూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 30మందికి వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసహాయం చెక్కులను గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బాధిత కుటుంబాల వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి ద్వారా సీఎం చంద్రబాబు ఇతోధికంగా ఆర్థిక సహాయం అందజేస్తున్నారని, ఈ ఒక్కరోజే రమారమి రూ.30 లక్షల చెక్కులు అందచేశామన్నారు.

పీ 4 పై గ్రామసభలు

జలదంకి, జూలై17(ఆంధ్రజ్యోతి): పీ 4పై గురువారం మండలంలోని పలు పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన ప్రత్యేకాధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో బంగారు కుటుంబాల వివరాలను చదివి వినిపించారు. ఎంపికైన వారి వివరాలను పునఃసమీక్షించారు. మండలంలోని అన్నవరం, బ్రాహ్మణక్రాక, చోడవరం, చినక్రాక, గట్టుపల్లి, జలదంకి, జమ్మలపాలెం, కమ్మవారిపాలెం, కేశవరం, సోమవరప్పాడు గ్రామాల్లో ఈ సభలు జరిగాయి. పంచాయతీ కార్యదర్శులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

రహదారుల నిర్వహణపై నిర్లక్ష్యం

ఆర్‌అండ్‌బి రోడ్ల నిర్వహణను పట్టించుకోని అధికారులు

దెబ్బ తింటున్న మార్జిన్లు ● అడ్డగోలుగా పగులగొడుతున్న వైనం

కొండాపురం, జూలై17(ఆంధ్రజ్యోతి): రోడ్లు అభివృద్ధి చెందాలని గ్రామాల్లో ప్రజాభీష్టం మేరకు ప్రజా ప్రతినిధులు రూ. కోట్లు వెచ్చించి రహదారులు నిర్మిస్తున్నారు. అయితే నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి దెబ్బ తింటున్నాయి.మండలంలో సుమారు 50 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. కొండాపురం- కొమ్మి, కొండాపురం- భీమవరప్పాడు, కొండాపురం- గరిమెనపెంట, కొండాపురం- శెట్టిపాలెం పరిధిలో ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. ఈ నాలుగు రహదారుల్లో కొండాపురం- శెట్టిపాలెం రోడ్డు డబుల్ రోడ్డుగా అభివృద్ధి చెందే క్రమంలో పనులు జరుగుతున్నాయి. మిగిలిన రోడ్లపై ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్వహణ లేక తీవ్రంగా దెబ్బతిన్నాయి.

● **దెబ్బతింటున్న మార్జిన్లు**

రోడ్డు నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్లు సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో వేసిన కొద్ది రోజులకే దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా రోడ్డుకు రెండు వైపులా మార్జిన్‌కు తోలుతున్న మట్టి నాసిరకంగా ఉండటంతో గుంతలు పడి, రెండు వాహనాలు ఎదురైన సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ద్విచక్ర వాహనచోదకులు రోడ్డు దిగితే చక్రాలు జారిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం ఇష్టారీతిలో రోడ్లను పగులగొట్టి పైపులు వేస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత పగులగొట్టిన రోడ్డును అలానే వదిలివేస్తున్నారు. దీంతో ఆ ప్రదేశంలో ఇంకా పెద్ద గుంతలు పడుతున్నాయి. ఈగుంతల్లో వాహనచోదకులు ప్రయాణం చేయాలంటేనే భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్లను కాపాడాలని మండల వాసులు కోరుతున్నారు.



దెబ్బతిన్న రోడ్డు మార్జిన్, ప్రమాద సూచికలు లేని రోడ్డు మలుపు

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే
సుపరిపాలనలో తొలి అడుగు

కావలి,జూలై17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజాభిప్రాయం, ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణ ముసునూరులోని 15,16 వార్డుల్లోని 121వ బూత్‌లో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి తిరిగి సమస్యలను తెలుసుకుని, సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల కోసం అధికారులు చుట్టూ తిరగకుండా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు. టీడీపీ నేతలు మీ ఇళ్ల వద్దకు వచ్చి మీ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారన్నారు.అనంతరం కచేరీ మిట్టలో మీ కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన బ్లెస్డ్ హోమ్ మొదటి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. చిన్నారుల ప్రదర్శించి సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూ రావు, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, పోట్లూరు శ్రీనివాసులు, బొట్లగుంట శ్రీహరినాయుడు, తిరువీధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ముసునూరులో సుపరిపాలన కరపత్రాన్ని అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

అపోహలు నమ్మొద్దు... మీ భూములు ప్రభుత్వం తీసుకోదు : ఇంటూరి

ఉలవపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల భూములను పరిశ్రమల స్థాపన కోసం ఎట్టిపరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకోదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. గురువారం సాయంత్రం కరేడు పంచాయతీ పరిధిలోని బట్టిసోమయ్యపాలెం మత్స్యకార గ్రామంలో ఆయన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడారు. కొందరు కావాలనే మత్స్యకారుల్లో అపోహలు, భయాందోళనలు నెలకొల్పారని, వాటిని మనసులో నుంచి తొలగించుకొని తనపై నమ్మకం ఉంచమని ఆయన కోరారు.బాధిత రైతులను త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గరకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. చచ్చినా బతికినా ఇక్కడే మా జీవితాలు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తేలేదని, ప్రభుత్వ భూసేకరణకు తాము వ్యతిరేకమని మహిళలు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు చెపారు. మీ భూములు ఎక్కడికిపోవు నన్ను నమ్మండని ఎమ్మెల్యే వారితో అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాచగల్లు సుబ్బారావు, ఆదాము, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **రైతులను ఒప్పించే భూములు తీసుకుంటాం**

కందుకూరు, ఆంధ్ర జ్యోతి): ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం బలవంతపు భూసేకరణ చేయబోమని, రైతులను ఒప్పించే భూములు తీసుకుంటామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కరేడులో రెండుపంటలు, మూడు పంటలు పండే భూములను ఇండోసోల్ కోసం తీసుకోబోమని, ఈ విషయమై ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడుతో చర్చించగా ఆయన అంగీకరించారని తెలిపారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపే విషయంలో రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే కమిటీ వేసిందని, ఎట్టి పరిస్థితుల్లో జరిగి తీరుతుందన్నారు. ప్రకాశంలో కలిశాకే తాను పోటీ చేస్తానన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడు : గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి

మున్సిపల్ కార్మికులకు చట్టబద్ధమైన జీతాలు ఇవ్వాలి

కావలి(టౌన్), జూలై17(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులకు చట్టబద్ధమైన జీతాలు, సెలవులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. మోహన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన కార్మికుల సమ్మె శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దాటవేత వైఖరిని అవలంబిస్తూ కాలయాపన చేస్తున్నదన్నారు. గత ప్రభుత్వం ఆప్కాస్‌లో కార్మికులను నియమించిందని, అప్పటినుంచి కార్మికులకు కొంత వెసులుబాటు కలిగిందన్నారు. మళ్లీ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పాలని చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కృష్ణమోహన్, పీ. పెంచలయ్య, మధుసూదన్‌రావు, యూనియన్ నాయకులు తురకా శీనయ్య, బీ. మహేష్, రమేష్, జీ శీనయ్య, చిన్నమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న సీపీఎం నేత మోహన్‌రావు

1, 2 తేదీల్లో ఆత్మకూరులో జాబ్‌మేళా

ఆత్మకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆగస్టు 1, 2 తేదీల్లో ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ మాట్లాడుతు మండలంలోని అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తే జడ్పీ నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి రఫీఖాన్, తహసీల్దారు పద్మజాకుమారి, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం

ఆత్మకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) మున్సిపాల్టీ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని సీఐటీయు నాయకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గురువారం సమ్మెకు దిగారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్టీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, గౌరవాధ్యక్షుడు కె డేవిడ్‌రాజు, యుఈఈయు డివిజన్ నాయకులు షేక్ మస్తాన్, వి వేణు, కె ప్రసాద్, పి హరిబాబు, పి శివ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి సంతాపం

అనంతసాగరం జూలై 17 (ఆంధ్రజ్యోతి): రేవూరుకు చెందిన టీడీపీ నాయకుడు చల్లా శ్రీరాములు (60) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని సీనియర్ నాయకులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి పరామర్శించి సంతాపం తెలియజేశారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయడం హర్షణీయం

కావలి,జూలై17(ఆంధ్రజ్యోతి): యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయటం హర్షణీయమని ఆర్డీవో వై.సుధాకర్‌రెడ్డి తెలిపారు. కావలి రూరల్‌మండలం రుద్రకోటలో గురువారం దేవళ్ల రమణయ్య జ్ఞాపకార్థం బుల్లెట్ బాయ్స్ యూత్ 31 మంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని ఆర్డీవో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తనిధి కేంద్రంలో అవసరమై గ్రూప్ రక్త నిల్వలు ఎప్పుడూ అందుబాటులో ఉండాలంటే యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. అనంతరం సుధాకర్‌రెడ్డితోపాటు ఎంపీపీ ఆర్. సుందరరావు, లక్ష్మీబాయి రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందచేసారు. ఈ కార్యక్రమంలో బుల్లెట్ బాయ్స్ యూత్ లీలా శంకర్, దేవళ్ల చిన బాబు, ఉప్పు నారాయణ, గండికోట హరీష్, శివక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

రోడ్డు పనుల ప్రారంభం



తారురోడ్డు పనులు పరిశీలిస్తున్న ఐవోడబ్ల్యూ రాజేష్

బిట్రగుంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట కొత్త రైల్వేస్టేషన్ నుంచి ఇబ్రహీంపేట మెయిన్ బజారుకు వరకు తారురోడ్డు పనులు గురువారం ప్రారంభమయ్యాయి.ఈ పనుల్లో నాణ్యతను స్థానిక ఐవోడబ్ల్యూ రాజేష్ పరిశీలించారు. నాణ్యత లోపించకుండా పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రైలు ప్రయాణికులు, రైల్వే సిబ్బంది కర్రతుమ్మ చెట్ల వల్ల ఇబ్బందులు పడుతున్నారని, జంగిల్ క్లీనింగ్, ఫైయిర్ ఉడ్ కు త్వరలో వేలం వేస్తామన్నారు.

మేం చెప్పినోళ్లకే!

(5వ పేజీ తరువాయి)

అందరికీ అనుమానాలు వస్తున్నాయి. కొంతమంది నాయకులు అవసరం లేకపోయినా అధికార దర్పం ఉపయోగించి వందల బస్తాలు ఇళ్లకు తరలిస్తున్నారు. మరికొంత మంది పంట సాగు చేపట్టకపోయినా వచ్చే సీజన్‌కు ఉంటాయని ముందు జాగ్రత్తగా తరలిస్తున్నారు. దీంతో చిన్న, సన్నకారు రైతులకు యూరియా అందడం లేదు. అయినా అదనపు కోటా కింద యూరియా బస్తాలను జిల్లాకు తీసుకొస్తున్నా ఆ నాయకులకు సమాచారం అంది, తమ వైపు మళ్లించుకుంటున్నారు.

● **తీవ్ర ఒత్తిడిలో ఎంఏవో, వీఏఏలు**

అధికార పార్టీ నాయకులు యూరియాను తరలించుకుపోతుండటంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు, రైతులు మండల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులను తీవ్రస్థాయిలో ప్రశ్నిస్తున్నారు. తాము ఏం చేయమంటారని బతిమలాడుకునే పరిస్థితి నెలకొంది. అధికారపార్టీ నాయకులను ప్రశ్నిస్తే ఏమవుతుందోనన్న ఆందోళన, మరోవైపు చిన్న, సన్నకారు రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.

● **ముందుగా నగదు చెల్లిస్తేనే...**

గతంలో మండల వ్యవసాయ అధికారులు, వీఏఏలు వారి పరిధిలో ఎంత మేర విస్తీర్ణం ఉంది.. ఎన్ని ఎకరాల్లో పంటలు సాగవుతాయని ఒక అంచనా వేసి ముందుగానే ఎరువులను తెప్పించి గోదాముల్లో ఉంచేవారు. అవసరమైన రైతులు వచ్చి పొలం పత్రాలు, ఆధార్ చూపించి నగదు చెల్లించి ఎరువులు తీసుకెళ్లేవారు. అయితే ప్రస్తుతం ఆ పద్ధతికి స్వస్తి పలికారు. రైతులు ముందుగా నగదు చెల్లించిన తరువాత వీఏఏలు మార్క్‌ఫెడ్‌కు ఇండెంట్ పెడతారు. రెండు, మూడు రోజులకు రైతు సేవా కేంద్రం వద్దకు లోడ్ వస్తుంది. ఆ తర్వాతే రైతులకు పంపిణీ చేస్తారు. మార్క్‌ఫెడ్‌కు బకాయిల బెడద లేకుండా ఉండేలా ఈ పద్ధతి తీసుకొచ్చారు. అయితే దీన్ని కొంత మంది నాయకులు దుర్వినియోగం చేస్తున్నారు. లారీ లోడ్‌కు వారే ముందుగా నగదు చెల్లించి తీసుకెళ్లిపోతున్నారు.

● **ప్రైవేటులో అధిక ధరలు**

వరినాట్ల తరువాత కేవలం 40 రోజుల్లోనే యూరియాతో అవసరం ఉంటుంది. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు అదనపు ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు. అదేమిటని ప్రశ్నిస్తే స్టాక్ లేదనే మాట కూడా చెబుతున్నారు. ఇంకొంత మంది యూరియాతోపాటు డీఏపీ, ఇతర పురుగు మందులు కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టంగా చెబుతున్నారు. ఒక్కో బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకు అదనంగా వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. అయితే వీటిపై రైతులు అధికారులకు సూచన ప్రాయంగా సమాచారం ఇస్తున్నారే తప్ప ఫిర్యాదు మాత్రం చేయడం లేదు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

40వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచాం

జిల్లా అవసరాలకు మించి అదనంగా యూరియాను అందుబాటులో ఉంచాం. ఇప్పటివరకు దాదాపుగా 40వేల మెట్రిక్ టన్నులు అమ్మకాలు జరిగాయి. అందులో సగం సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఇవ్వడం జరిగింది. వ్యవసాయశాఖ అధికారులు సిఫార్సు చేసిన దానికంటే ఎక్కువగా రైతులు యూరియాను వినియోగిస్తున్నారు. దీనివల్ల చీడపీడలు పెరిగే అవకాశం ఉంది. ఎకరాకు 135 కేజీలు మూడు దఫాలుగా వాడితే సరిపోతుంది. వ్యాపారులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి


గది మరమ్మతులు పూర్తయినా
వినియోగించని టీచర్లు



మరమ్మతులు పూర్తయిన పాఠశాల గది

లింగసముద్రం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్లలోని ఏజీపీ పాఠశాల ఆవరణలో మరమ్మతులకు గురైన పాత తరగతి గదిని ఏడాది క్రితం అధికారులు బాగు చేశారు.అయితే ఈ గదిని ప్రస్తుతం ఉపాధ్యాయులు వినియోగించడం లేదు. దీంతో ఈ గది నిరుపయోగంగా ఉంది. అయితే కొందరు విద్యార్థులు తరగతి లోపలా, మరికొందరు వరండాలో చదువుకుంటున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి గదిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తలిదండ్రులు పలువురు కోరుతున్నారు.

డిప్లమో విద్యతో అధిక నైపుణ్యాలు



తరగతుల ప్రారంభం సందర్భంగా నిర్వహించిన పూజలు

కందుకూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): డిప్లమో విద్యతో విద్యార్థులు తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో అధిక నైపుణ్యాలు పొంది ఉద్యోగాలు సాధించగలుగుతారని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టరు కంచర్ల విజయ్ శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో మొదటి సంవత్సరం డిప్లమో తరగతులను గురువారం పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో ప్రాక్టికల్ నైపుణ్యాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని పరిశ్రమలతో అనుబంధంతో విద్యార్థులకు ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వరపర్ల హరిబాబు, అకడమిక్ ఇన్‌చార్జి మీరావలి, ఏవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణ చర్యలు తీసుకోండి

నెల్లూరు (వైద్యం), జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డెంగ్యూ వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. గురువారం నగరంలోని రామ్మూర్తి నగర్, జనార్దన్‌రెడ్డి కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. జాతీయ డెంగ్యూ నివారణ మాసోత్సవాలలో భాగంగా ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. లార్వా సర్వే, ఫీవర్ సర్వేలను సక్రమంగా నిర్వహించాలని, జ్వరాలను గుర్తించిన ప్రాంతాలలో రక్తపూతలు తీసి పరీక్షించాలని సూచించారు. ఏపీ హెల్త్ యాప్ కొత్త వెర్షన్‌లో ఫొటోలు అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సూపర్వైజర్లు, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గంధ మహోత్సవం

అనంతసాగరం : స్థానిక గుంతబజారులో ఉన్న హజరత్ కరిముల్లా షా ఖాదరీ దర్గా గంధమహోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. గ్రామంలో గంధాన్ని మేళతాళాలతో ఊరేగించి దర్గా వద్దకు చేర్చి ఫాతేహా అనంతరం భక్తులకు అందించారు. ఈసందర్భంగా అన్నదానం నిర్వహించారు.

సోమశిల అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

అనంతసాగరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద అసంపూర్తిగా నిలిచిన ఆప్రాన్ పనులు త్వరగా పూర్తిచేయాలని సీపీఎం కౌలు రైతు రాష్ట్ర సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జలాశయాన్ని వారు సందర్శించారు. కార్యక్రమంలో కార్యదర్శి హరిబాబు, అన్వర్‌బాష, పెంచలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

1, 2 తేదీలలో మెగా జాబ్‌మేళా

ఏఎస్ పేట : నిరుద్యోగ యువత కోసం ఆగస్టు 1, 2వ తేదీలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసన్నకుమారి ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, డిప్లమో, ఐటిఐ, ఇంజనీరింగ్ పాస్ అయిన యువతీ, యువకులు పాల్గొనవచ్చని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



కావలి : విత్తన దుకాణాల్లో తనిఖీలు చేసిన వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు

కావలి రూరల్, జూలై17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో గురువారం వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి లలిత ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో ఏడీఏలు రవికుమార్, నర్సోజీరావు విజిలెన్స్ సీఐ రాఘవరావు పాల్గొన్నారు. పట్టణంలోని సిరి సీడ్స్, నాగార్జున సీడ్స్ దుకాణాల్లో స్టాకు వివరాలు, రిజిష్టర్లు, ఫారంఏ, లైసెన్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు.

● **కందుకూరు (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో గురువారం విజిలెన్స్, వ్యవసాయశాఖల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమతిపత్రాలు లేని పురుగుమందులను సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఏడీఏ నరసోజీ, వినుకొండ ఏడీఏ రవికుమార్ మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీంతో కలిసి ఎరువులు, పురుగుమందుల దుకాణాలతోపాటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. అనుమతి పత్రాలు లేకుండా అనధికారికంగా తెప్పించిన పురుగుమందుల విక్రయాలను నిలిపివేయాలని ఆదేశాలు జారీచేశారు. సీజ్‌చేసిన పురుగుమందుల విలువ రూ. 32లక్షలు ఉంటుందని ఏవో తెలిపారు.ఎక్కడైనా అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు తప్పవన్నారు.

వర్షంతో ఉపశమనం

కలిగిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఓ మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. వారంరోజులుగా ఎండవేడిమి, ఉక్కపోతలకు తాళలేక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి ఈ వర్షం ఉపశమనం కలిగించింది. రైతులు హర్షం వ్యక్తం చేశారు.



దేవుడి సాక్షిగా.. చెబుతున్నా!

శ్రీకాళహస్తి జనసేన మాజీ ఇన్‌ఛార్జి కోట వినుత వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాసులు అలియస్ రాయుడు హత్యపై రాజకీయ కోణంలో నాపై ఆరోపణలు చేస్తున్నారు. వైసీపీ సోషల్ మీడియా అలా ప్రచారం చేస్తోంది. ఈ విషయంపై ఎక్కువ మాట్లాడదలచుకోలేదు కానీ, మొదటిసారి స్పందిస్తున్నా. గుళ్లో ఉన్నాం. దేవుడి సాక్షిగా, నా కుటుంబం సాక్షిగా చెబుతన్నా ఆ హత్యకు, నాకూ ఎటువంటి సంబంధం లేదు.

- తిరుమలలో మీడియా ముందు
శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

మాకు ప్రాణహాని ఉంది

- ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పాత్రపై అనుమానాల్లేవు
- పవన్ కల్యాణ్ స్పందించి న్యాయం చేయాలి
- శ్రీకాళహస్తిలో హత్యకు గురైన శ్రీనివాసులు అలియాస్ రాయుడు సోదరి కీర్తి



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న కీర్తి

శ్రీకాళహస్తి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలంటూ శ్రీకాళహస్తిలో హత్యకు గురైన శ్రీనివాసులు అలియాస్ రాయుడు సోదరి కీర్తి కోరుతోంది. గురువారం ఆమె శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తిని కలిసి ఈ మేరకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. వినుత దంపతులతో పాటు రాయుడిని హత్య చేయడంలో పాత్రధారులైన వారందరినీ గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరింది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, తన సోదరుడు శ్రీనివాసులు అలియాస్ రాయుడికి అక్రమ సంబంధాలను ఆపాదిస్తూ సోషల్ మీడియాలో విపరీతంగా దుష్ప్రచారాలు చేయడం తమను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని తెలిపింది. వీటిని నిరోధించాలని విజ్ఞప్తి చేసింది. కాగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఇతర రాజకీయ నేతల ప్రమేయంపై తమకు ఎలాంటి అనుమానం లేదని కీర్తి చెప్పింది. వినుత దంపతులకు సంబంధించిన కొందరు హత్య కేసు వెలుగు చూసిన సమయంలో రాజీ కోసం రూ.30 లక్షల నగదును తమకు ఆశ చూపి ప్రలోభాలకు గురిచేశారని కీర్తి తెలిపింది. తమకు న్యాయం జరిగే వరకు రాజీ పడబోమని ఆమె స్పష్టం చేసింది. వినుత దంపతుల వైపు నుంచి తమకు ప్రాణహాని ఉందంటూ, వారి రాజకీయాల కోసం తన సోదరుడిపై నిందలు మోపారని ఆరోపించింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించి తమకు న్యాయం చేయాలని కీర్తి విజ్ఞప్తి చేసింది.

ఆదిమూలం స్వరం మారింది



- అధిష్ఠానం నాన్చుడు ధోరణితోనే సత్యవేడు టీడీపీలో గందరగోళం

తిరుపతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబే చుక్కాని అంటూ ఓవైపు అధినేతను పొగడ్తలతో ముంచెత్తుతూనే మరోవైపు అధిష్ఠానంపై ధిక్కార స్వరం వినిపిస్తున్నారు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం. ఆయనపై హైకమాండ్ విధించిన సస్పెన్షన్ కొనసాగుతున్న నేపథ్యంలో పార్టీ కార్యక్రమాల కోసం కో ఆర్డినేటర్‌గా కూరపాటి శంకర్‌రెడ్డిని అధిష్ఠానం నియమించింది. అటు ఎమ్మెల్యే, ఇటు కో ఆర్డినేటర్ ఇరువురూ వేర్వేరుగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలకు వెళుతున్నారు. పర్యటనలలో అధికారులు శంకర్‌రెడ్డికి ప్రాధాన్యత ఇస్తుండడంతో ఎమ్మెల్యే ఆదిమూలం మండిపడుతున్నారు. ఎన్నికైన ఎమ్మెల్యే తానుండగా పార్టీ కో ఆర్డినేటర్‌కు ప్రాముఖ్యత ఇవ్వడమేమిటని బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. మృదువుగా మొదలైన ఆయన వాగ్బాణాలు క్రమేపీ కరుకుగా మారుతున్నాయి.

సత్యవేడుకు పార్టీ కార్యక్రమాల కో ఆర్డినేటర్‌గా కేఎస్ఆర్ నిర్మాణ సంస్థ అధినేత కూరపాటి శంకర్‌రెడ్డిని నియమించిన తర్వాత పరిణామాలు వేగంగా మారుతున్నాయి. జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సత్యవేడులో కార్యకర్తల సమావేశం పెట్టి మరీ శంకర్‌రెడ్డిని పరిచయం చేశారు. ఆయన సారథ్యంలో పార్టీ కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టత ఇచ్చారు. ప్రాధాన్యత ఇవ్వాలని అధికార యంత్రాంగానికి కూడా సంకేతాలిచ్చారు. ఎమ్మెల్యే ఆదిమూలం, ఆయన కుమారుడు సుమన్ ఇరువురూ శంకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపినా తాజా కామెంట్లు ఆయన కయ్యానికి సిద్ధమైనట్లే అని అర్థమవుతోంది.

అధిష్ఠానం అస్పష్ట వైఖరే కారణం

అయితే ఎమ్మెల్యే ఆదిమూలం విషయంలో అధిష్ఠానం అస్పష్ట వైఖరి కారణంగానే సమస్యలు ఎదురవుతున్నాయని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఆదిమూలంపై స్పష్టమైన నిర్ణయమూ తీసుకోక, అలా అని ఆయనకు ప్రాధాన్యమూ ఇవ్వక, మరొకరిని తెరమీదకు తీసుకురావడం గందరగోళాన్ని మరింత పెంచుతోంది. కొత్తగా బాధ్యతలు అప్పగించిన వారికి అయినా పార్టీ వ్యవహారాలపై పూర్తి అధికారాలు అప్పగించాలి. ఈ నాన్చుడు ధోరణి వల్ల టీడీపీకి పటిష్ఠమైన సత్యవేడులో పార్టీ బలహీనపడుతోందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో ఉంది.

మారిన ఆదిమూలం తీరు!

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం వాస్తవానికి టీడీపీ పార్టీ కార్యక్రమం. అదేమీ ప్రభుత్వ, అధికారిక కార్యక్రమం కాదు. సస్పెన్షన్‌లో ఉన్నందున కోనేటి ఆదిమూలం టీడీపీ తరపున ఆ కార్యక్రమాల్లో పాల్గొనే వీల్లేదు. అయినా ఆయన కో ఆర్డినేటర్ శంకర్‌రెడ్డికి పోటీగా తనపాటికి తాను తొలి అడుగు కార్యక్రమం పేరిట నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. అటు కో ఆర్డినేటర్, ఇటు ఎమ్మెల్యే విడిగా పర్యటిస్తుండడంతో పార్టీ శ్రేణులు, అధికారులు, ఉద్యోగులు గందరగోళానికి గురవుతున్నారు. సమస్య అక్కడితో ఆగలేదు. శంకర్‌రెడ్డికి సత్యవేడు అధికారులు ప్రాధాన్యం ఇస్తుండడం కూడా ఆదిమూలంకు మింగుడు పడడం లేదు. తన అసంతృప్తిని సన్నిహితుల దగ్గర లేదా పార్టీ నేతల దగ్గర వ్యక్తం చేయడం కాకుండా బహిరంగంగానే మాట్లాడుతున్నారు. ఆదిమూలం వైఖరిని కో ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఇటీవల అమరావతి వెళ్లి అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. ఆ తర్వాతే శంకర్‌రెడ్డికి ప్రాధాన్యత ఇవ్వాలని, అభివృద్ధి పనులకు సంబంధించి ఆయన చేసే ప్రతిపాదనలకు ప్రాముఖ్యత ఇవ్వాలని సూచనలు వచ్చినట్టు సమాచారం.

రాష్ట్రపతి చేతుల మీదుగా 'స్వచ్ఛ' అవార్డు

- ఢిల్లీలో అందుకున్న మేయర్, కమిషనర్



రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకున్న మేయర్, కమిషనర్

తిరుపతి(విద్య), జూలై 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులో భాగంగా.. మూడులక్షల జనాభా విభాగంలో సూపర్ స్వచ్ఛ లీగ్‌ని తిరుపతి కైవసం చేసుకుంది. ఈమేరకు ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో కేంద్ర హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతులమీదుగా రాష్ట్రమంత్రి నారాయణ, ప్రధానకార్యదర్శి సురేష్‌కుమార్‌తో పాటు మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య కలసి ఈ అవార్డు అందుకున్నారు. అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో అవార్డు సాధించగలిగామని మేయర్, కమిషనర్ సంతోషం వ్యక్తంచేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధిస్తామన్నారు.

26న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ (జడ్పీ) స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 26వతేదీన జరగనుందని సీఈవో రవికుమార్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో 26న ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

రేపటి సీఎం పర్యటనలో మార్పులు

- పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ప్రజా వేదిక
- ఏర్పేడు ఐఐటీలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

తిరుపతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం చేపట్టే తిరుపతి జిల్లా పర్యటనలో మార్పులు చోటు చేసుకున్నాయి. కొన్ని కార్యక్రమాలను అదనంగా చేర్చారు. తొలుత ఖరారైన పర్యటన ప్రకారం.. సీఎం చంద్రబాబు తిరుపతి కపిలతీర్థంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం పోలీస్ పరేడ్ మైదానంలో పీ4 కార్యక్రమం కింద దాతలుగా ముందుకు వచ్చిన మార్గదర్శులు, వారు దత్తత తీసుకునే బంగారు కుటుంబాలతో ముఖాముఖీ సమావేశమవుతారు.
అయితే గురువారం ఆయన పర్యటనలో మార్పులు జరిగాయి. అందులో భాగంగా శనివారం ఉదయం సీఎం చంద్రబాబు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి తిరుపతి వస్తూ మార్గమధ్యంలో రేణిగుంట మండలం తూకివాకం వద్ద తిరుపతి కార్పొరేషన్‌కు చెందిన ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శిస్తారు. అక్కడ్నుంచి కపిలతీర్థం చేరుకుని కపిలేశ్వరస్వామిని దర్శిస్తారు. ఆపై ఆలయ ప్రాంగణాన్ని, పుష్కరిణిని భక్తులతో కలసి శుభ్రపరుస్తారు. అటు నుంచి పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకుని ప్రజా వేదికలో పాల్గొంటారు. ఆ కార్యక్రమానికి 2500 మందిని అనుమతించనున్నారు. వారితో పాటు పీ4 మార్గదర్శులు, బంగారు కుటుంబాలు కూడా పాల్గొననున్నాయి. ప్రజా వేదికలో సీఎం ప్రజలతోనూ, మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో ముఖాముఖి మాట్లాడనున్నారు. అనంతరం ఏర్పేడు వద్ద ఐఐటీ చేరుకుని ఆ ప్రాంగణంలో రూ.2 కోట్లతో నిర్మించిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభిస్తారు. అక్కడి నుంచే వర్చువల్‌గా అనంతపురం హబ్‌ను కూడా ప్రారంభిస్తారు. ఆ సందర్భంగా అక్కడ స్టార్టప్‌లు ఏర్పాటు చేయనున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని తిరుగు ప్రయాణమవుతారు.

సీఎం పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు

రేణిగుంట, ఆంధ్రజ్యోతి: సీఎం చంద్రబాబు పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. అన్ని శాఖల అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా వారికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే తూకివాకం వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సాల్, అడిషనల్ ఎస్పీలు రవి మనోహరాచారి, వెంకట్రావు, ఆర్డీవో రామ్మోహన్, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, ఇతర శాఖల అధికారులు, ఎయిపోర్ట్ అధికారులు పాల్గొన్నారు.



తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

1200 మందితో భారీ బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: ఏడు గంటలు.. నాలుగు కార్యక్రమాలు. ఇదీ శనివారం నాటి సీఎం చంద్రబాబు పర్యటన షెడ్యూల్. దీనికోసం 1200 మందితో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకునే సీఎం.. సాయంత్రం 5.45 గంటల సమయంలో తిరుగు ప్రయాణమవుతారని అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో భద్రతకోసం చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి పోలీసులను రప్పిస్తున్నారు. డీఐజీ షిమోషీ నేతృత్వంలో ఎస్పీ హర్షవర్ధనరాజు పర్యవేక్షణలో ఐదుగురు అదనపు ఎస్పీలు, 13 మంది డీఎస్పీలు, 30 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, 200 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, దాదాపు 700 మంది పోలీసులు, రిజర్వు బలగాలు, డాగ్, బాంబు స్క్వాడ్లు, రోప్ పార్టీలు, రోడ్డు డిగ్గింగ్ పార్టీలు బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. సీఎం పర్యటన ప్రాంతాల్లో ఎస్పీ పర్యవేక్షణలో గురువారం అడ్వాన్సు లైజన్ సెక్యూరిటీ నిర్వహించారు. అలాగే, ఏర్పేడు వద్దనున్న ఐఐటీలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను, తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాట్లను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధనరాజు తదితరులు పరిశీలించారు.

ప్రత్యేకాధికారుల నియామకం

తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: సీఎం చంద్రబాబు శనివారం జిల్లాలో పర్యటించే ప్రాంతాలకు ప్రత్యేక అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ నియమించారు. ఏర్పేడు ఐఐటీ వద్ద జేసీ శుభం బన్సల్, తూకివాకం, ప్రజావేదిక వద్ద నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, కపిలతీర్థం వద్ద టీటీడీ జేఈవో వీరబ్రహ్మంను నియమించారు. శనివారం నాటి సీఎం చంద్రబాబు పర్యటన.. ఏర్పాట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

'పల్లం'లో అధికారుల సర్వే

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఏర్పేడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పల్లం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 35లో ఉన్న అంధనాల గుంట ప్రభుత్వ స్థలంలో గురువారం అధికారులు సర్వే నిర్వహించారు. సీజేఎఫ్ఎస్ భూముల కొనుగోలు ముసుగులో కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నించడంపై 'పల్లంపై పెద్దల కన్ను' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై తహసీల్దారు భార్గవి స్పందించి ముగ్గురు సర్వేయర్లను పంపి సర్వే చేయించారు. అంధనాల గుంతకు సంబంధించి సర్వేరాళ్లు నాటారు. ఈ భూమిలో ఎవరు ప్రవేశించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో ఆ భూమిలో ప్రభుత్వ భూమి అనే బోర్డును ఏర్పాటు చేస్తామని తహసీల్దారు చెప్పారు.

ఏడు మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల ఖరారు

- ఆరు పదవులు టీడీపీకి.. ఒకటి జనసేనకు

తిరుపతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లు ఖరారయ్యారు. ఈ మేరకు టీడీపీ అధిష్ఠానం గురువారం జాబితాను విడుదల చేసింది. గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలో రెండేసి, చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ఒక కమిటీకి అధ్యక్షులను నిర్ణయించారు. ఈ ఏడు ఛైర్మన్ పదవుల్లో ఒకదానిని మిత్రపక్షమైన జనసేనకు కేటాయించారు. గూడూరు కమిటీకి చిల్లకూరు నీరజ, వాకాడుకు మర్రి ప్రమీల, (టీడీపీ) ఛైర్మన్ పదవికి నామినేట్ కానున్నారు. అలాగే వెంకటగిరి నియోజకవర్గం రాపూరు కమిటీకి ఆకుల వాణి, వెంకటగిరికి పునుగోటి విశ్వనాథ్, సూళ్లూరుపేటకు ఆకుతోట రమేష్, నాయుడుపేట కమిటీకి ఉయ్యాల ప్రవీణ్ (జనసేన) పేర్లు ఖరారయ్యారు. తిరుచానూరు మార్కెట్ కమిటీకి టీడీపీ నుంచీ ఊరుబిండి మౌనిక పేరు ఖరారైంది. ఆయా కమిటీల వారీగా సభ్యులతో కలిపి పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడాల్సి వుంది. టీడీపీ అధిష్ఠానం చేసిన ఈ నామినేటెడ్ పదవుల ప్రకటనతో ఆయా నియోజకవర్గాల్లోని టీడీపీ శ్రేణుల్లో సందడి నెలకొంటోంది.

ఐఐటీలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం

- రోజుకు 20 టన్నులు ప్రాసెస్ చేసేలా యంత్రాల ఏర్పాటు



ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు, రైతులు

ఏర్పేడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ (సామూహిక ఇంక్యుబేషన్ కేంద్రం)ను గురువారం కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రోజుకు 20 టన్నుల వరకు మామిడి, అంజీర్, జామ, తదితర పండ్లను ప్రాసెస్ చేసి జ్యూస్, పల్ప్, జామ్, పికెల్స్ వంటివి తయారు చేసేలా యంత్రాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో.. ఇక్కడి పంటలను ప్రాసెసింగ్ చేసి నాణ్యమైన ఉత్పత్తులుగా మలచి మార్కెటింగ్ అవకాశాలను కల్పిస్తామని కేంద్రమంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ యూనిట్ స్థాపన వల్ల ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం లభించనుందని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. ఈ యూనిట్ స్థాపనకు ఎంవోఎఫ్‌పీఐ నుంచి రూ.2.75కోట్లు, తిరుపతి ఐఐటీ నుంచి రూ.1.20కోట్లు చొప్పున రూ.3.95కోట్లు ఖర్చు చేశామని వివరించారు. జిల్లాలో ఎక్కువగా మామిడి పండుతోందని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఈ ఏడాది 6 లక్షల టన్నుల తోతాపురి రకం మామిడి కాయలు దిగుబడి కాగా, ఎగుమతులు లేకపోవడంవల్ల రైతులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర విషయంలో కొంత తోడ్పాటు అందించడంతో రైతులకు ఉపశమనం లభించిందన్నారు. ఇక్కడి మామిడి పంటకు దేశవ్యాప్తంగా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్‌తో యువతకు ఉపాధి లభిస్తుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాలో తోటల పెంపకం, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్ అవసరాలపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వ స్థాయి సలహా మండలి ఏర్పాటు చేయాలని కోరారు. రైతులు పండించే ఆహారోత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గోదాములు, శీతల గిడ్డంగులను అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేంద్రాన్ని తిరుపతి ఐఐటీ రసాయనిక ఇంజనీర్ ప్రొఫెసర్ కేఎస్ఎం రాఘవరావు సమన్వయంతో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మార్గదర్శనంలో అభివృద్ధి చేశారు. ఎంఎస్, పీహెచ్‌డీ విద్యార్థులకు ఫుడ్ టెక్నాలజీలో ప్రాక్టికల్ శిక్షణకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది. ఈ సెంటర్‌లో తయారయ్యే ఉత్పత్తులు 'స్వస్థ' పేరిట మార్కెట్‌లోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో శేఖర్‌బాబు గెడ్డం, కేంద్ర ఆహార ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి దేవేష దేవాల్, ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి చౌదరి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పాల్గొన్నారు.

మేలైన 'నీలం మామిడి' టన్ను రూ.50వేలు

బంగారుపాళ్యం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మామిడి సీజన్ ముగుస్తుండడంతో ధరలు పెరగుతున్నాయి. గురువారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో మేలైన నీలం రకం టన్ను రూ.50వేలు పలికింది. బంగారుపాళ్యంకు చెందిన యాసిన్ తీసుకొచ్చిన మేలైన నీలం రకం మామిడిని మండీ యజమానులు వేలం నిర్వహించగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వ్యాపారస్తులు పోటాపోటీగా వేలం పాట పాడారు. చివరిగా చెన్నైకు చెందిన వేల్ మురుగన్ టన్ను రూ.50వేలకు దక్కించుకున్నారు.

తోతాపురి టన్ను రూ.7వేలు

గుజ్జుపరిశ్రమకు తరలించే తోతాపురి రకం మామిడి కాయలు టన్ను రూ.7వేలు పలికాయి. టేబుల్ రకాలైన బేనీషా టన్ను రూ.50వేలు, కవరు కట్టిన తోతాపురి టన్ను రూ.22-24వేల వరకు ధర పలికింది. గుజ్జు పరిశ్రమకు తరలించే నీలం రకం కాయల టన్ను కూడా రూ.7వేల ధర పలికింది.

టీటీడీకి మరో 30 ఏళ్లు ఎల్పీజీ

● ఐఓసీఎల్ స్టోరేజ్ కేంద్రానికి భూమిపూజ

తిరుమల, జూలై17(ఆంధ్రజ్యోతి): టీటీడీకి మరో 30 ఏళ్లపాటూ ఎల్పీజీ సరఫరా చేసేలా ఐఓసీఎల్ సంస్థతో ఒప్పందం కుదిరినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలోని ఔటర్ రింగురోడ్డులో 45 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గ్యాస్ స్టోరేజ్ కేంద్ర నిర్మాణానికి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ప్రస్తుతం నందకం సమీపంలో ఉన్న ఐఓసీఎల్ గ్యాస్ ప్లాంట్‌ను భద్రత కారణాలతో ఇక్కడికి



మారుస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, రూ.8.13 కోట్ల వ్యయంతో 1.86 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను టీటీడీ-ఐఓసీఎల్ సంయుక్తంగా ఆరు నెలల్లో పూర్తిచేస్తామన్నారు. ఈ గ్యాస్‌ను లడ్డూప్రసాదాలు, అన్నప్రసాదాల తయారీకి వినియోగించనున్నట్టు తెలిపారు. కాగా తిరుమల డంపింగ్ యార్డు వద్ద రూ.12.05 కోట్ల వ్యయంతో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం జరుగుతోందని ఐఓసీఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ప్రతిరోజు వచ్చే 55 టన్నుల తడి వ్యర్థాల్లో 40 టన్నులు ఐఓసీఎల్ ప్లాంట్‌కు తరలించి రోజుకు వెయ్యి కేజీల బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, సుధాకర్, డీఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'హరిహర వీరమల్లు' విజయం కోసం..

తిరుమల, జూలై17(ఆంధ్రజ్యోతి): 'మా హీరో పవన్‌కల్యాణ్ సినిమా హరిహర వీరమల్లు ఘన విజయం సాధించాలని స్వామిని కోరుకున్నా' అని నిర్మాత డీవీవీ దానయ్య తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఈనెల 24వ తేదీన 'హరిహర వీరమల్లు' చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో స్వామిని దర్శించుకున్నట్టు తెలిపారు. కాగా, సెప్టెంబరు 25న తమ 'ఓజీ' చిత్రం కూడా విడుదలవుతుందని చెప్పారు.



నిర్మాత డీవీవీ దానయ్య

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ దాకా వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.66 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,104

తలనీలాలు సమర్పించినవారు: 31,896



పారదర్శకంగా 'సహకారం'

● పీఏసీఎస్‌ల్లో ఆన్‌లైన్ లావాదేవీలు ● చేతిరాత అక్రమాలకు ప్రభుత్వం చెక్

● మొండి బకాయిల వసూలుకు చర్యలు



తిరుపతి(కలెక్టరేట్), జూలై 17(ఆంధ్రజ్యోతి): గాడి తప్పిన సహకార వ్యవస్థ ఇప్పుడిప్పుడే చక్కబడుతోంది. కార్యకలాపాలన్నీ పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రికార్డుల తారుమారుతో అక్రమాలకు పాల్పడే వైనాలకు తెరదించుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పీఏసీఎస్) భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. భూములు లేకున్నా పలువురిని సభ్యులుగా చేర్పించేశారు. బోగస్ పత్రాలతో కొందరు నాయకులు ఏకంగా రుణాలు కొట్టేశారని సమాచారం. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పీఏసీఎస్‌ల ప్రక్షాళనకు పూనుకుంది. తొలుత పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణకు నడుం బిగించింది. ఉమ్మడి జిల్లాలోని 75 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోనూ కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తయింది. రెండు నెలల క్రితం వరకూ సొసైటీల కార్యకలాపాలన్నీ మాన్యువల్‌గా జరిగేవి. చేతిరాతలతో కొన్నిచోట్ల రికార్డులను తారుమారు చేసేవారనే విమర్శలుండేవి. ఇప్పుడీ సంఘాల లావాదేవీలను ఆన్‌లైన్ చేయడంలో అక్రమాలకు కళ్లెం పడినట్లేనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పారదర్శకంగా సేవలందుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 21పైగా పీఏసీఎస్‌లకు ప్రభుత్వం చైర్మన్లు, సభ్యులను నియమించింది.

వారి ఆచూకీ ఎక్కడ?

పీఏసీఎస్‌ల్లో రైతులకు ఈకేవైసీ చేయించే ప్రక్రియ ఐదు నెలలుగా జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలోని 75 పీఏసీఎస్ పరిధిలో 4.60లక్షలమందికి సభ్యత్వముంది. ఇందులో 2.96లక్షల మంది ఈకేవైసీ పూర్తి చేయించుకున్నారు. మిగిలిన వారి ఆచూకీ తెలియడంలేదు. సభ్యత్వమున్నవారు ఈకేవైసీ చేయించుకోకపోవడంలో పలు అనుమానాలకు తావిస్తోంది. ఇందులో కొంతమంది చనిపోయినవారూ ఉన్నారు. రుణాలు తీసుకుని చెల్లించని స్థానికేతరులూ వందల సంఖ్యలో ఉన్నట్టు తెలుస్తోంది. కాగా 2019 నాటికి రూ. 1100 కోట్ల మేర రుణాలు పంపిణీ చేయగా ఈయేడాది మార్చి నాటికి అది 2,034కోట్లకు చేరింది. గత ప్రభుత్వ హయాంలో రూ.92కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి.

మొండి బకాయిలు వసూలు చేస్తాం



జిల్లాసహకార కేంద్ర బ్యాంకు పరిధిలో మొండి బకాయిల వసూలుకు త్వరగా చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాది చివరినాటికి 50 శాతం మేర పెండింగ్ బకాయిలను రాబడతాం. ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్‌ల పరిధిలో ఇప్పటికీ ఈకేవైసీ చేయించుకోని వారిని గుర్తించే పని మొదలుపెట్టాం. రెండు నెలల్లో ఈకేవైసీ పూర్తి చేస్తాం.

- శంకర్‌బాబు, సీఈవో, జిల్లా సహకార కేంద్రబ్యాంకు





లక్ష్మీపురం సర్కిల్ వద్ద చేరిన వర్షపు నీటిలో ఆగిన ఆటోను నెట్టుతూ..

తిరుపతిలో జోరు వాన

తిరుపతిలో గురువారం రాత్రి జోరు వాన కురిసింది. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద నీళ్లు చేరడంతో పోలీసులు సూచనలిచ్చి పంపారు. లక్ష్మీపురం సర్కిల్‌లో చేరిన నీటితో ద్విచక్ర వాహనదారులు, ఆటోల వాళ్లు ఇబ్బంది పడ్డారు. గరుడవారధి నుంచి నీళ్లు రోడ్డుపై ఉధ్రుతంగా దూకాయి.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

రాజన్న ఫౌండేషన్‌కు 'సీఎస్‌ఆర్ టైమ్స్' అవార్డు

● ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీ చేతుల మీదుగా ప్రదానం

తిరుపతి/రేణిగుంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అమరరాజా కంపెనీ సౌజన్యంతో నడుస్తున్న రాజన్న ఫౌండేషన్‌కు ప్రతిష్ఠాత్మక సీఎస్ఆర్ టైమ్స్-2025 అవార్డు దక్కింది. గురువారం ఢిల్లీలోని లీ మెరిడియన్ హోటల్లో ప్రముఖ సీఎస్ఆర్ మార్కెటింగ్, బ్రాండ్ హనాక్ సంస్థ నిర్వహించిన గ్లోబల్ సీఎస్ఆర్-2025 అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ఫౌండేషన్ హెడ్ రాళ్ళపల్లి సతీష్ అవార్డును అందుకున్నారు. గ్రామీణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి విభాగంలో రాజన్న ఫౌండేషన్‌కు ఈ అవార్డు దక్కింది. మాజీ మంత్రి గల్లా అరుణకుమారి తన తండ్రి, దివంగత మాజీ ఎంపీ పాటూరు రాజగోపాల్‌నాయుడు పేరిట ఏర్పాటు చేసిన రాజన్న ఫౌండేషన్ గ్రామీణాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ రంగంలో నీటి సంరక్షణ కోసం చెక్ డ్యామ్‌లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు వంటివి కల్పించడంతో పాటు పశు వైద్యం తదితర సేవలందిస్తూ గ్రామీణ ప్రజలకు మెరుగైన జీవనోపాధి అవకాశాలను ఫౌండేషన్ అందిస్తోంది. ఈ సేవలకు గుర్తింపుగా సీఎస్ఆర్ టైమ్స్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా రాజన్న ఫౌండేషన్ ఫౌండర్ గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి రంగంలో తమ ఫౌండేషన్ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇకమీదట కూడా సేవలను కొనసాగిస్తామన్నారు. అవార్డు రావడానికి కృషి చేసిన అందరికీ అభినందలు తెలిపారు. అమరరాజా సంస్థల చైర్మన్ గల్లా జయదేవ్ మాట్లాడుతూ సానుకూల సామాజిక మార్పునకు కృషి చేయడంలో తమ ఫౌండేషన్ నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనమన్నారు. రానున్న రోజుల్లో తమ ఫౌండేషన్ ద్వారా ఇతర రంగాల్లోనూ విశిష్ట సేవలు అందిస్తామన్నారు.



కేంద్ర మంత్రి గడ్కరీ నుంచి అవార్డు అందుకుంటున్న రాజన్న ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్

శ్రీవారి భక్తులకు శుభవార్త

● తిరుమల బస్సుల్లో డిజిటల్ పేమెంట్



డిజిటల్ పేమెంట్ ద్వారా టికెట్ తీసుకున్న భక్తుడు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ శ్రీవారి భక్తులకు శుభవార్త తెలిపింది. తిరుమల-తిరుపతి మధ్య తిరిగే ఆర్టీసీ బస్సుల్లో డిజిటల్ పేమెంట్స్ విధానాన్ని గురువారం ప్రవేశపెట్టింది. మిగతా బస్సుల్లో ఈ విధానం అమల్లో ఉన్నా రిటర్న్ టిక్కెట్స్ జారీ మూలాన ఇప్పటివరకు తిరుమల బస్సుల్లో డిజిటల్ పేమెంట్స్ అమలు కాలేదు. దీంతో అటు భక్తులకు, ఇటు కండక్టర్లకు సమస్యలు ఎదురయ్యేవి. పదేపదే ఫిర్యాదులు వస్తుండడంతో ప్రజారవాణాధికారి జగదీష్ డిజిటల్ పేమెంట్స్‌కు అనుమతి ఇవ్వాలని ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపారు. రెండు రోజుల క్రితం అనుమతి రావడంతో ప్రస్తుతం విష్ణునివాసం, ఏడుకొండలు బస్టాండు, కపిలతీర్థం, శ్రీనివాసం, బాలాజీ బస్టాండులలో ప్రవేశపెట్టారు. త్వరలోనే తిరుమలలో అందుబాటులోకి తేనున్నారు.

విజిలెన్సు ఎస్పీకి ఐపీఎస్ కేడర్ ఖరారు

తిరుపతి(నేరవిభాగం), జూలై 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీ(నాన్ కేడర్ ఎస్పీ) కరీముల్లా షరీఫ్‌కు ప్రభుత్వం ఐపీఎస్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన 2011లో పోలీసు శాఖలో తొలిసారిగా డీఎస్పీ హోదాలో అనంతపురం జిల్లా కదిరిలో పనిచేశారు. 2013 మేలో హైదరాబాదులో పోలీసు శిక్షణకు వెళ్లారు. అనంతరం ఐదు నెలల పాటు వెయిటింగ్‌లో ఉండిపోయారు. 2014 జనవరిలో ఏలూరు విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు విభాగంలో డీఎస్పీగా పనిచేసి.. మళ్లీ ఏడాది పాటు వెయిటింగ్‌లో ఉండి, కర్నూలు ఏపీఎస్పీ బెటాలియన్‌కు బదిలీ అయ్యారు. 2016లో తిరుపతి సీఐడీకి బదిలీపై వచ్చారు. మళ్లీ కొంత కాలం వెయిటింగ్‌లో ఉండిపోయారు. ఆయన పనితీరును గుర్తించి ప్రభుత్వం అనంతపురం జిల్లా పెనుకొండ డీఎస్పీగా నియమించింది. అక్కడ పనిచేస్తున్నప్పుడే కరీముల్లా షరీఫ్‌కు అదనపు ఎస్పీగా పదోన్నతి లభించగా, ఇంటెలిజెన్సు విభాగానికి బదిలీ అయ్యారు. అక్కడ రెండేళ్ల పాటు పనిచేశాక 2020 మేలో సెబ్‌కు గుంటూరుకు పోస్టింగ్ ఇస్తూ అక్కడ నుంచి ఏలూరుకు అటాచ్‌మెంటు ఇచ్చారు. 2020 అక్టోబరులో విజయవాడ ఇంటెలిజెన్సు విభాగానికి బదిలీ అయ్యారు. 2023లో నాన్ కేడర్ ఎస్పీగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఆ హోదాలో తొలిసారిగా విజయవాడ ప్రాంతీయ విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటుకు బదిలీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు విభాగానికి నియమించారు. ఈయన హయాంలోనే టీటీడీ ఇంజనీరింగ్‌తో పాటు వివిధ విభాగాల్లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తనదైన శైలిలో విచారణ కొనసాగించి డీజీకి నివేదిక పంపారు. ఇప్పటికే తుడాలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వానికి విచారణ నివేదిక అందించారు. మరిన్ని పథకాల్లో అవినీతికి సంబంధించి ప్రభుత్వాదేశాలతో విచారణ జరుపుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో పనిచేస్తున్న 11 మంది నాన్ కేడర్ ఎస్పీలకు ప్రభుత్వం ఐపీఎస్ కేడర్ ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో కరీముల్లా షరీఫ్ కూడా ఉన్నారు. తన పనితీరుతో ఈయన డీజీ కమెండేషన్ అవార్డులు మూడు.. 2018లో ఏ- కేటగిరి కింద ఏబీసీడీ అవార్డులు.. 2024లో పోలీసు సేవా పతకం అందుకున్నారు.



కరీముల్లా షరీఫ్

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

- నిందితుడి అరెస్టు -

తిరుపతి(నేరవిభాగం), జూలై 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈస్ట్ పోలీసులు గురువారం ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పామర్రు మండలం ఎర్రచేను గ్రామానికి చెందిన కదంబూరు రమేష్ కొంత కాలంగా ఒడిశా నుంచి గంజాయి తెప్పించి తిరుపతి కేంద్రంగా విక్రయాలు చేస్తున్నాడు. ఇక్కడి నుంచి చెన్నైకి చెందిన స్మగ్లర్లకు చేరవేస్తున్నాడు. గురువారం ఒడిశాకు చెందిన గోపాల్ రమేష్‌కు ఆరు కిలోల గంజాయి అప్పగించి, చెన్నైలోని అభికి చేర్చాలని కోరాడు. రమేష్ గంజాయి తీసుకుని చింతలచేను వద్దనున్న సామవాయి మార్గంలో నడచి వెళుతుండగా ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ హేమాద్రి తన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. అతని నుంచి ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన గోపాల్, చెన్నైకు చెందిన అభిని అరెస్టు చేయాల్సి ఉందని సీఐ చెప్పారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి

రాజకీయాల్లో ఉన్నవారికి స్వామి దర్శనం అవసరం


● ఆర్కే రోజా

తిరుమల, జూలై17(ఆంధ్రజ్యోతి): 'స్వామిని దర్శించుకుంటే పాజిటివ్ ఫీల్ వస్తుంది. భగవంతుడిని దర్శించుకోవడం రాజకీయాల్లో ఉన్నవారికి చాలా ముఖ్యం. మళ్లీ కొత్త శక్తితో ప్రజల్లోకి వెళతాం.' అని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం దర్శించుకున్న అనంతరం ఆలయం బయట మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్య చేశారు. కాగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా శ్రీవారి దర్శనం చేసుకున్నారు.

నోటీసులిస్తే పరిష్కారమైనట్టేనా!

●ఆక్రమణలపై అధికారుల తీరిది ●విస్తుపోతున్న ఫిర్యాదుదారుడు

చంద్రగిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): భూమి ఆక్రమణపై తానిచ్చిన ఫిర్యాదు పరిష్కారమైనట్లు తప్పుడు సమాచారం రావడంతో ఓ వ్యక్తి అవాక్కయ్యాడు. వివరాలిలా ... గత వైసీపీ ప్రభుత్వంలో ఏ.రంగంపేటలో నాగపట్ల రెవెన్యూ లెక్కదాఖల్లో సర్వే నెంబర్ 80-ఏలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకులు కబ్జా చేశారు. అందులో చిన్న చిన్న రేకుల షెడ్లనూ నిర్మించేశారు. వీటిలో విద్యుత్ సర్వీసులు మంజూరయ్యాయి. పంచాయతీ పన్నుల రికార్డుల్లోనూ ఈ నిర్మాణాలు నమోదయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు పైలెట్ ప్రాజెక్టు కింద స్వర్ణ నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోకి ఎ.రంగంపేట, కందులవారిపల్లె, చిన్నరామాపురం పంచాయతీలను చేర్చారు. ఇదే అదనుగా వైసీపీ నాయకులు తమ పలుకుబడితో అక్రమ రేకుల షెడ్లకు ఉచిత సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొన్నారు. ఈ అక్రమ వ్యవహారంపై ఇటీవల టీడీపీ కార్యకర్త ఒకరు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలకు ఆదేశించారు. ప్రభుత్వ భూమిలో విద్యుత్ సర్వీసులు తొలగించాలని స్థానిక రెవెన్యూ అధికారులు , ఇంటి పన్నులు రద్దు చేయాలని పంచాయతీ రాజ్ అధికారులు పరస్పరం నోటీసులు పంపుకొన్నారు. ఫిర్యాదుదారుడికి నోటీసు ఇస్తున్నట్లు సంతకం తీసుకున్నారు. ఇది జరిగిన కొద్ది సేపటికే అక్రమ నిర్మాణాల సమస్య పరిష్కారమైనట్లు ఫోనుకు మెసేజు రావడంతో ఫిర్యాదుదారుడు విస్తుపోయాడు. ౹ మంత్రి లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులకు మరోమారు ఫిర్యాదు చేయనున్నట్లు సదరు కార్యకర్త తెలిపారు.



కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి

వాయిదాలకు హాజరుకాని 'ఎర్ర' స్మగ్లర్

● జామీనిచ్చిన వ్యక్తికి ఆరు నెలల జైలు, జరిమానా

తిరుపతి(నేరవిభాగం)జూలై 17(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో కండిషన్ బెయిల్‌పై బయటకు వచ్చిన స్మగ్లర్ తొలినుంచీ వాయిదాలకు హాజరు కాలేదు. దీంతో జామీను ఇచ్చిక వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.25వేల జరిమానా విధిస్తూ ఎర్రచందనం జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. తొమ్మిదేళ్ల క్రితం ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ కర్ణాటకకు చెందిన ఆసీఫ్ ఆలీషేక్ అరెస్ట్ అయ్యాడు. పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అతను బెయిలు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. న్యాయమూర్తి విధించిన షరతులపై రేణిగుంటకు చెందిన వెంకటరమణ జామీను ఇచ్చారు. తొలి నుంచీ నిందితుడు కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో జామీను ఇచ్చిన వెంకటరమణకు న్యాయమూర్తి ఆరు నెలల పాటు జైలుశిక్షతో పాటు రూ.25వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎర్రచందనం కేసుల్లో నిందితులకు జామీను ఇచ్చి జైలు పాలు కావద్దని విజ్ఞప్తి చేశారు.

బాలుర గృహాన్ని సందర్శించిన గ్రాండ్ మాస్టర్ అభిజిత్



జ్ఞాపికను అందుకుంటున్న హోం సూపరింటెండెంట్ వీరయ్య

తిరుపతి(క్రీడలు), జూలై 17(ఆంధ్రజ్యోతి): గ్రాండ్ మాస్టర్ అభిజిత్‌కుంటే గురువారం సాయంత్రం మంగళంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. బాలురను, బాలికలను పలకరిస్తూ చదరంగంలో మరింత రాణించాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన ఫస్ట్ ఏసియన్ ఆన్‌లైన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన బాలుర జట్టుకు(చరణ్, దుర్గ, శ్రీనివాసులు, సునీల్, శ్యామ్), బాలికల జట్టు(భవానీ, రాణి, వేదశ్రీ, సంజన, హర్షిత)కు, హోం సూపరింటెండెంట్ వీరయ్యకు ఐఓసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముకేష్‌రంజన్‌దాస్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఓసీఎల్ ప్రతినిధి తిమ్మప్ప, హోం సూపరింటెండెంట్స్ కాసిందొర, సునీత, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సెలవులోని టీచరుకు నోటీసులు

తిరుపతి(విద్య),జూలై17(ఆంధ్రజ్యోతి): ఎలాంటి ముందస్తు అనుమతిలేకుండా దీర్ఘకాలంగా సెలవుపై ఉన్న శ్రీకాళహస్తి మండలానికి చెందిన వ్యాయామ టీచర్ ఎ.బాలకృష్ణకు గురువారం డీఈవో కేవీఎస్ కుమార్ నోటీసులు జారీ చేశారు. 2023జనవరి 24నుంచి ఈ ఏడాది జూలై 15వరకూ ముందస్తు అనుమతి పొందకుండా పాఠశాల విధులకు గైర్హాజరైనందున డీఈవో కార్యాలయం ద్వారా విధులకు హాజరుకావాలని రిజిస్టర్డ్ పోస్టు ద్వారా తాఖీదుని జారీ చేశామన్నారు.దీనికి బాలకృష్ణ నుంచి ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. రానున్న మూడురోజుల్లో శ్రీకాళహస్తి ఎంఈవో కార్యాలయంలో సంప్రదించి ఉత్తర్వులకు తన సంజాయిషి సమర్పించాలని,లేనిపక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధుల నుంచి శాశ్వతంగా తొలగించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

నగరిలో రాజకీయ రగడ

● ఇసుక రవాణా కేసులో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లకు రిమాండ్

● అధికార, ప్రతిపక్షాల నడుమ మాటలయుద్ధం

పుత్తూరు/నగరి,జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలో వారం రోజులుగా రాజకీయం వేడెక్కింది.తమిళనాడుకు ఇసుక తరలిస్తున్నారంటూ అధికార, ప్రతిపక్షాలు పరస్పర ఆరోపణలతో వాతావరణాన్ని వేడెక్కించాయి.ఈ నేపథ్యంలో స్టోన్ డస్ట్ ముసుగులో తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా చేసిన కేసుకు సంబంధించి ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లను అరెస్టు చేసినట్లు నగరి సీఐ విక్రమ్ గురువారం తెలిపారు.కౌన్సిలర్ బీడీ భాస్కర్‌ను పోలీసులు పట్టుకోగా మరో కౌన్సిలర్ బిలాల్ తానే లొంగిపోయారని సీఐ తెలిపారు.వీరిద్దరిని పుత్తూరు సబ్ కోర్టులో హాజరుపరచగా జడ్జి జూలై 31 వరకు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.రెండ్రోజుల క్రితం ఇదే కేసులో చెన్నైకి చెందిన భరత్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.అతడిచ్చిన సమాచారంతోనే వీరిద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. పుత్తూరు కోర్టులో కౌన్సిలర్లను హాజరుపరిచిన విషయం తెలిసి మాజీ మంత్రి రోజా అక్కడకు చేరుకున్నారు.టీడీపీ నాయకుల ఇసుక అక్రమ రవాణాను సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకే వైసీపీ కౌన్సిలర్లను వేధిస్తున్నారని ఆరోపించారు.

ఎమ్మెల్యేపై రోజా ఫిర్యాదు

మహిళ అని కూడా చూడకుండా మీడియా ముందు తనను అసభ్యపదజాలంతో దూషించిన ఎమ్మెల్యే భానుప్రకాష్‌పై కేసు నమోదు చేయాలని నగరి పోలీసులకు మాజీ మంత్రి రోజా గురువారం ఫిర్యాదు చేశారు.ఇసుక,బియ్యం స్మగ్లింగ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో నిజాలను ఎత్తి చూపితే టీడీపీ నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బియ్యం స్మగ్లింగ్‌లో దొరికిన అమృతరాజ్ నాడార్ ఎమ్మెల్యే అనుచరుడేనన్నారు.రూ.2000 ఇస్తే ఏ పనైనా చేస్తుందంటూ మార్కెట్లో మాటవున్న ఆమె నేడు రెండువేలకోట్లకు వారసురాలు ఎలా అయిందంటూ ఎమ్మెల్యే తనను కించపరిచేలా మాట్లాడారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సీఐని రోజా కోరారు.



పుత్తూరు సబ్‌కోర్టు వద్ద అనుచరులతో రోజా

తప్పులు మీరు చేసి మాపై నెడతారా?

● రోజా వ్యాఖ్యలపై ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



పుత్తూరు అర్బన్/నగరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తప్పు చేస్తే తప్పక శిక్షింపబడాలని, అది ఎవరైనా.. ఎంతటి వారినైనా ఉపేక్షించే పరిస్థితి లేదని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.వైసీపీ కౌన్సిలర్లపై ఇసుక అక్రమ రవాణా కేసు నమోదు నేపథ్యంలో మాజీ మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. తాను తప్పు చేస్తూ ఇతరులను దొంగ అనడం రోజాకు అలవాటుగా మారిందన్నారు. నగరి నియోజకవర్గంలో ఇసుక, బియ్యం స్మగ్లింగ్‌తో రోజాతో పాటు ఆమె అన్నలకు, భర్తకు సంబంధం లేదని కాణిపాకం వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు.రూ.12 వేల అద్దె ఇంటినుంచి నేడు ఊరికో ఇంటిని నిర్మించుకునే స్థాయికి ఆమె ఎదిగిందని ఆరోపించారు.నగరిలో ఇటీవల పట్టుబడ్డ ఏడు ఇసుక టిప్పర్లు వైసీపీ కౌన్సిలర్లవేనని, వాటిని పట్టించింది తామేనని, ఆ విషయాన్ని రోజా గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యేగా గెలిచాక పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, ప్రతి గ్రామంలో తిరిగానని,ఆ విషయం ఏడాదికాలంగా దినపత్రికలు పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. అనవసరంగా నియోజకవర్గంలో కన్పించడం లేదని మాట్లాడడం సబబు కాదన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సూళ్లూరుపేట, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్లుగా ఆకుతోట రమేష్, ఉయ్యాల ప్రవీణ్




తడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సూళ్లూరుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడుగా దీర్ఘకాలంగా పని చేసిన ఆకుతోట రమేష్ సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. అలాగే జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌ను నాయుడుపేట వ్యవసాయ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. పలువురు వారికి అభినందనలు తెలియజేశారు.

వాకాడు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ప్రమీల నియామకం



వాకాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వాకాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కోట మండలం ఎంపీటీసీ దారా సురేష్ సతీమణి మర్రి ప్రమీల నియమితులయ్యారు. ఇక్కడ తొలిసారిగా ఎస్సీ సామాజిక వర్గానికి ఏఎంసీ పదవి దక్కింది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల కూటమి నాయకులు వారిని అభినందించారు.

గూడూరు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా చిల్లకూరు నీరజ



చిల్లకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం ముత్యాలపాడు పంచాయతీలో ఉన్న గూడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా చిల్లకూరు గ్రామానికి చెందిన చిల్లకూరు నీరజను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు. ఈమె గతంలో చిల్లకూరు సర్పంచుగా పనిచేశారు. తనకు ఈ పదవి రవడానికి సహకరించిన ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కి, తానంకి నానాజీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



యూనియన్‌లో చేరిన కార్మికులతో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

గూడూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారమే ఏఐటీయూసీ ధ్యేయమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక సీవీసీ పార్కులో మున్సిపాలిటీలో పనిచేస్తున్న పలువురు పారిశుధ్య కార్మికులను యూనియన్‌లో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు రాజీలేని పోరాటాలను సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రాఘవులు, గోపి, శశికుమార్, ఉదయ్, సీవీఆర్‌కుమార్, రమేష్, జమాలుల్లా, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్

గూడూరు అర్బన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యా ర్థులు విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అల వరుచుకోవాలని నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ అన్నారు. గురువారం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన ఎన్నికలలో లీడర్లుగా గెలుపొందినవారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఎన్నికలపై అవగాహన కల్పించడంతోపాటు సమాజంలో బాధ్యతను పెంపొందించేందుకు ఈ తరహా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. గెలుపొందిన విద్యార్థులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మయ్య, రఘురామ్, భవానీ, సునీల్, పుష్పలత పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి

గూడూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో గురువారం వైసీపీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా సూపర్‌సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు పరచలేదన్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డి, చేవూరు విజయ్‌మోహన్‌రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, భక్తవత్సలరెడ్డి, బత్తిన విజయ్‌కుమార్, మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

నాయుడుపేట-చెన్నై రహదారిపై భారీ వాహనం



నాయుడుపేట టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : చెన్నై నుంచి రాజస్థాన్‌కు బాయిలర్‌కు సంబంధించిన ఐరన్ సామగ్రితో ఓ భారీ లారీ నాయుడుపేట-చెన్నై రహదారిపై ప్రయాణించింది. నాయుడుపేట రహదారిపై కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

గూడూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసింగరావుపేటలోని బాలసదనం వసతిగృహంలో గురువారం ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో మురళీనాయుడు సహకారంతో విద్యార్థినులకు దుస్తులను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, జీ చంద్రశేఖర్, శ్రీనివాసులు, మురళీనాయుడు, అరుణ, కుమార్, నాగరాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

గ్రామ బహిష్కరణ అవాస్తవం


గ్రామస్తులను విచారిస్తున్న అధికారులు

వాకాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడి రాయదొరువు పంచాయతీ పరిధిలోని మన పాళెంలో గ్రామబహిష్కరణ అవాస్తవమని తహసీల్దారు రామ య్య, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎస్ఐ నాగబాబు స్పష్టంచేశారు. తమను గ్రామం నుంచి బహిష్కరించారని ఆశిరెడ్డి లక్ష్మీ ఫిర్యాదులపై గురువారం వారు విచారణ చేపట్టారు. అనంతరం తహసీల్దారు రామయ్య మాట్లాడుతూ గ్రామంలో పలువురు తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసుకుంటే ఆశిరెడ్డి లక్ష్మీ దంపతులు పక్కా ఇంటి నిర్మాణం చేపట్టడంతో సమస్య ఏర్పడిందన్నారు. అయితే గ్రామానికి వ్యతిరేకంగా వ్యవహరించడంతో ఆవేదన చెందామని ఎవరినీ బహిష్కరించలేదని గ్రామస్తులు తెలియజేశారని వివరించారు. గ్రామంలో 14 షాపులు గ్రామ కంఠంలో నెలకొల్పడంతో వారందరికీ నోటీసులు ఇస్తామన్నారు. ఆర్ఐ అఖిల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పింక్‌బస్సు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ మహమ్మారిని ప్రథమ దశలోనే గుర్తించాలని అందుకు పింక్‌బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి సిమ్స్ వైద్యులు పద్మావతి తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ వద్ద పింక్ బస్సు ద్వారా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ పొగతాగడం, మత్తు పానీయాలు సేవించడం వంటి వాటితోపాటు వారసత్వంగా క్యాన్సర్ సోకేఅవకాశం ఉంటుందన్నారు. దానిని గుర్తించేందుకు ఏడాదికోసారి పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. నిర్లక్ష్యం వహించ కూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు సీహెచ్‌సీ వైద్యులు కిషోర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

ఏరులై పారుతున్న మద్యం: వైసీపీ

దొరవారిసత్రం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలో ఊరూర మద్యం ఏరులై పారుతోందని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం దొరవారిసత్రంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం పేరుతో వైసీపీ నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను మరిచిపోయారని విమర్శించారు. చంద్రబాబు మోసాలను వైసీపీ కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటా తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో వైసీపీ మండల కన్వీనర్ రాహుల్‌రెడ్డి, సీనియర్ నాయకులు వేణుంబాక మునస్వామినాయుడు, నల్లారెడ్డి సురేష్‌రెడ్డి, వేమురెడ్డి, రాజగోపాల్, మురళినాయుడు, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

● రెండు ఆలయాలు, ఒక దుకాణంలో చోరీలు


దొరవారిసత్రంలో చోరి జరిగిన దుకాణం

దొరవారిసత్రం, జూలై 17(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలంలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. మండలంలోని మినమనమూడి శివాలయం, చందనమూడి పుట్టాలమ్మ గుడిలో చోరీలకు పాల్పడ్డారు. రెండు చోట్ల రెండు సవర్ల బంగారు తాళి బొట్లు, హుండీలను పగల కొట్టి కొంత నగదు, ఆలయాల్లో మైక్ సెట్లు చోరీ చేశారు. అలాగే దొరవారిసత్రంలోని కర్లపూడి రమణయ్య దుకాణంలో చోరీ చేశారు. దుకాణంలోని 25 వేల నగదు, కొన్ని వస్తువులను అపహరించుకెళ్లారు. ఈ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

నార్త్‌గిరిజన కాలనీలో 'తొలి అడుగు'


కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని నార్త్‌గిరిజన కాలనీలో గురువారం టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా తిరిగి ఎన్డీఏ పాలనలో ఏడాదిలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జలీల్ అహ్మద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్, టీడీపీ నాయకులు నౌషాద్, తిరుమలశెట్టి కోటేశ్వరరావు, నందామోహన్, పల్లం శ్రీనివాసులు ఉన్నారు.

టిప్పర్ బోల్తా
డ్రైవర్, క్లీనర్లకు గాయాలు



నాయుడుపేట టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట -మల్లాం జంక్షన్ కూడలి సమీపంలో రహదారి బ్రిడ్జిపై నుంచి అదుపు తప్పి టిప్పర్ బోల్తా కొట్టింది. గురువారం తెల్లవారు జామున నెల్లూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న టిప్పర్ రహదారి బ్రిడ్జిపై నుంచి అదుపు తప్పి 30 అడుగుల ఎత్తునుంచి బోల్తా కొట్టి కిందపడింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ హరీ, క్లీనర్ వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ 108 సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అందించారు. అయినా పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరుకు తరలించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు : సబ్‌కలెక్టర్


వివాదాస్పద భూములను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

డక్కిలి, జులై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా హెచ్చరించారు. గురువారం ఆయన డక్కిలి మండలం పలుగోడు గ్రామంలో వివాదాస్పద భూమలను పరిశీలించారు. గ్రామంలో సర్వే నంబరు 1లో 6-30 ఎకరాల భూని కొందురు ఆక్రమించారంటూ ఇటీవల ఆ గ్రామానికి చెందిన కొంత మంది విజిలెన్సు మానటరీ సెల్ ద్వారా సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవి ప్రభుత్వ భూములని తెలియజేశారు. ఆక్రమిత భూముల్లోకి ఎవరూ వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. సదరు భూములను భూ పంపిణీలో అర్హులైన నిరుపేదలకు పట్టాలు ఇస్తామని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ పెంచలయ్య, వీఆర్వో ఆమని ఉన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం


మేనకూరులో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల, జడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి, రమణారెడ్డి తదితరులు

నాయుడుపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరి సంక్షేమం, అభివృద్ధే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి గురువారం మేనకూరులో ఆమె పర్య టించారు. మేనకూరులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీరామ మందిరంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మేన కూరు, భీమవరం, ద్వారకాపురం, తిమ్మాజికండ్రిగ, ఒద్దిగుంటకండ్రిగ గ్రామాల్లో ఇంటింటా తిరిగారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఉషోదయ పాఠశాల విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్థసారధి, జడ్పీటీసీ జ్యోతిరెడ్డి, కట్టా వెంకటరమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీరాంప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ నల్లు కస్తూరయ్య, గాలి రాజేష్‌నాయుడు, అరవ పెరిమిడి చంద్రారెడ్డి, పెళ్లకూరు టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, మాజీ ఎంపీపీ కన్నెమ్మ, సత్యం రాజు, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ యూనియన్ నుంచి ప్రధాన కార్యదర్శి బహిష్కరణ


మాట్లాడుతున్న కోటేశ్వరరావు

గూడూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నుంచి ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపిని ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కోటేశ్వరరావు తెలియజేశారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల పరిష్కారం కోసం సమ్మె చేపడుతున్నామన్నారు. ఈ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు గోపి పాల్పడుతున్న నేపథ్యంలో అతనిని యూనియన్ నుంచి బహిష్కరిస్తున్నామన్నారు. యూనియన్ చర్యలకు వ్యతిరేకంగా వ్యవహరించడంతో ఆయనను తమ యూనియన్ నుంచి తొలగించేలా ఏకగ్రీవంగా నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, టీవీ.రమణయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంతవరకు ప్రజల కోసమే శ్రమిస్తా

● ఘనంగా ఎమ్మెల్యే కురుగొండ్ల జన్మదినం ● రక్తదాన శిబిరాలు ఏర్పాటు ● అన్నదానం


ఎమ్మెల్యే రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న భైరవరం టీడీపీ నాయకులు దాసరి పెంచలయ్య, వెంకటేష్

వెంకటగిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని, తన ప్రాణం ఉన్నంతవరకు వారి కోసమే శ్రమిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలియజేశారు. గురువారం ఆయన జన్మదినం సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఈ నాలుగేళ్లలో రూ.713 కోట్లతో నియోజకవర్గంలోని ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం పూర్తి చేస్తానని చెప్పారు. ఇంకా నియోజకవర్గంలోని సాగు, తాగు నీటి సమస్య పూర్తిగా రూపుమాపడం తోపాటు, నియోజకవర్గంలో చిన్నతరహ పరిశ్రమలు తీసుకు వచ్చి నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తానని తెలిపారు.

పలువురి సన్మానం.. రక్తదానం

అంతకుముందు ఉపాధ్యాయ కాలనీలోని ఆయన నివాసం వద్ద జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత ఆయన గ్రామ శక్తి పోలేరమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నివాసంలో భైరవరం సోదరులు ప్రభాకర్ నాయుడు, రాజగోపాల్ నాయుడులు ఏర్పాటు చేసిన భారీ కేక్ కట్‌చేశారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జనసైనికులు సత్కరించారు. రక్తదాన శిబిరంలో పోలీసులు, యువకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుగంగ ఎస్ఈ రాధాకృష్ణ, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరాందాస్ గంగాధరం, భైరవరం టీడీపీ నాయకులు దాసరి పెంచలయ్య, వెంకటేష్, ఎంపీపీ తనూజారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతు శారద, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు విశ్వనాథ నాయుడు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్‌నాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, జానపాటి బాల, సామల లక్ష్మీపతి, మురళీ, జీకేపల్లి బాబు నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, దిలీప్, శానాయపాళెం ప్రసాద్ నాయుడు, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పోలంరెడ్డి కోటేశ్వర రెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి, రావి మస్తాన్ నాయుడు, రావి సత్యం నాయుడు, మంకు ఆనంద్, తోట కృష్ణయ్య, గుండు మనోజ్ పాల్గొన్నారు.

ఆదర్శపాలన అందిస్తాం


బాధ్యతలు తీసుకుంటున్న రవీంద్రనాథ్‌రెడ్డి

కోట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల ద్వారా రైతులను మరింత చైతన్య పరచి సంక్షేమ పథకాలు అందించి ఆదర్శపాలన అందిస్తామని పలువురు సహకార సంఘ చైర్మన్‌లు హామీ ఇచ్చారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం సహకార సంఘ చైర్మన్‌గా జరుగుమల్లి గ్రామానికి చెందిన ఉచ్చూరు రవీంద్రనాథ్‌రెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయనతోపాటు మరో ఇద్దరు సహకార సంఘ డైరెక్టర్లుగా బాధ్యతలు స్వకరించారు. దీంతో రవీంద్రనాథ్‌రెడ్డిని టీడీపీ సీనియర్ నాయకులు పెన్నక్క చెరువు తాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్‌లతోపాటు పలువురు నాయకులు, పూలమాలలు, శాలువాలతో అభినందించారు. ● చిట్టేడు సహకార సంఘ చైర్మన్‌గా రాఘవాపురం గ్రామానికి చెందిన చాపల శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. డైరెక్టర్లుగా చంద్రగిరి మధు, దూడిపల్లి సతీష్ బాధ్యతలు తీసుకున్నారు. ● సిద్ధవరం సహకారసంఘం చైర్మన్‌గా పుచ్చలపల్లి గ్రామానికి చెందిన కోటేశ్వర్‌రెడ్డి బాధ్యతలు తీసుకోగా ఆయనతోపాటు ఇద్దరు డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించారు.

'మా బడి ఇక్కడే ఉంచండి'



ధర్నా చేస్తున్న పీడీఎస్‌వో సభ్యులు

వెంకటగిరిటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొక్కలపాడులోని పాఠశాలను అక్కడే కొనసాగించాలని పీడీఎస్‌వో పట్టణ నాయకులు పవన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మొక్కలపాడు గ్రామంలోని పాఠశాల వద్ద పీడీఎస్‌వో ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన 19, 21 జీవోలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆలోచించి జీవోలను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో నాయకులు శేఖర్, నవీన్, పెంచలయ్య పాల్గొన్నారు.

బాబు పాలనలోనే.. తీర ప్రాంతాల అభివృద్ధి


ఎల్లూరులో సిమెంట్ రోడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

చిట్టమూరు, జులై 17(ఆంధ్రజ్యోతి) : చంద్రబాబు పాలనలోనే గూడూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న తీర ప్రాంత గ్రామాల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో గురువారం ఎల్లూరు, బురదగాలి కొత్తపాళెం పంచాయతీల్లో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బురదగాలి కొత్తపాళెంలో రూ.45 లక్షలు, బురదగాలిలో రూ. 50 లక్షలు, కుమ్మరపాళెంలో రూ.45 లక్షలు వెచ్చించి సిమెంట్ రోడ్లు వేశామన్నారు. ఈ గ్రామాల్లో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కరించామని గుర్తుచేశారు. ఎల్లూరు నుంచి కుమ్మరపాళెం వరకు వెళ్లే రోడ్డు వేసేందుకు సీఎంతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కుమ్మర పాళెంలో రూ.21.70 లక్షలతో నిర్మించిన హెచ్ఎస్ఆర్ ట్యాంక్, రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయం, సిమెంట్ రోడ్లను ఆయన ప్రారంభించారు. సీఎం సహాయ నిధి కింద ఎర్రబోతు రామూర్తికి రూ.4.50 లక్షల చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, తహసీల్దార్ సతీష్ కుమార్, టీడీపీ నాయకులు గూడూరు నియోజకవర్గ పరిశీలకులు శివకోటారెడ్డి, సత్యవేడు నియోజకవర్గం కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు, సుధాకర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సునీల్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, కస్తూరయ్య, గుంపర్ల చిన్నారావు, చెంచురామయ్య ఆచారి, నరేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కనీస వేతనాలు అందించాలి

నాయుడుపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ కార్మికులకు కనీసవేతనాలు అందించాలని సీఐటీయూ మండల కార్యదర్శి శివకవి ముకుంద డిమాండ్ చేశారు. నాయుడుపేట మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట గురువారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మోకాళ్ల మీద నిలబడి నిరసన తెలియజేశారు. ఐదు రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నా పాలకులుగానీ, అధికారులుగానీ స్పందించక పోవడం శోచనీయమన్నారు. కనీస వేతనాలు అందించే సమ్మె ఆపేదిలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు శ్రీనివాసులు, నాగరాజు, కాలేషా, రమేష్, చిరంజీవి, లీలామోహన్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి బలిజ సంఘం చేయూత

నాయుడుపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేటలో అనారోగ్యంతో మంచానికి పరిమితమైన కళ్యాణ్ శ్రీకాంత్ కుటుంబానికి వైద్య ఖర్చుల కోసం బలిజ సంఘ చేయూత ఫౌండేషన్ అధ్యక్షులు పగడాల శివప్రదీప్, కార్యదర్శి హంసా పృథ్వీచంద్‌లు రూ.9వేల ఆర్థిక చేయూత అందజేశారు. వారి వెంట సంఘ నాయకులు రామారావు, సునీత, నీలాంబరి, వాసు, కిరణ్, బాబి ఉన్నారు.

రెండో రోజూ కొనసాగిన మున్సిపల్ కార్మికుల ధర్నా

సూళ్లూరుపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం రెండో రోజూ కొనసాగింది. సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని కార్మికులు స్పష్టం చేశారు. జీవో నెంబరు 30 మేరకు వేతనాలను పెంచాలన్నారు. మున్సిపాలిటీ కార్మికుల సమ్మెకు డప్పు కళాకారులు, సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య, ఎస్‌కే రియాజ్ మద్దతు తెలిపారు.

నేడు చెంగాళమ్మకు శాకాంబరి అలంకారం

సూళ్లూరుపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు, తమిళ ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అధికారులు గురువారం నుంచే ప్రారంభించారు. అలంకారానికి కావాల్సిన కూరగాయలు, పండ్లను భక్తులు అందజేశారు.

చికిత్స పొందుతూ భవననిర్మాణ కార్మికుడి మృతి

నాయుడుపేట టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గాయపడి చికిత్స పొందుతూ ఉన్న ఓ భవన నిర్మాణ కార్మికుడుమృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తికి చెందిన వెంకటరాజు (26) నాయుడుపేట రాజగోపాలపురంలో ఓ భవన నిర్మాణ పని చేస్తూ 13వ తేదీ భవనంపై నుంచి కిందపడి గాయపడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

మోటారు సైకిల్ చోరీ

నాయుడుపేట టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ముగం నగర్‌లో మోటారు సైకిల్ చోరీకి గురైంది. పట్టణానికి చెందిన రాజేష్ తన మోటారు సైకిల్‌ను గురువారం ఉదయం ఆర్ముగం నగర్‌లో ఓ ఇంటి వద్ద పెట్టి ఎదురుగా ఉన్న దుకాణంలోకి వెళ్లి పనులు ముగించుకొని తిరిగివచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

టీడీపీ నాయకుల అన్నదానం

డక్కిలి, జులై 17 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలను డక్కిలిలో స్థానిక టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు జన్ని రమణయ్య తదితరులు పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, నాయకులు డక్కిలి చంద్రారెడ్డి, చెలికం నారాయణరెడ్డి, దందవోలు వెంకటరమణారెడ్డి, దుగ్గి వెంకటేశ్వర్లు, చెంచయ్య, కుమార్, పెంచలరెడ్డి, సునీల్‌రెడ్డి, పిల్లి శ్రీనివాసులురెడ్డి, సుబ్రమణ్యం ఉన్నారు.

బాల్యవివాహాలు నేరం

చిల్లకూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామంలో ప్రజలకు గురువారం సీడీపీవో మెహబూబి, చిల్లకూరు పీహెచ్‌సీ వైద్యురాలు తేజస్వినిలు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల చట్టరీత్యా నేరమన్నారు. వైద్య, అంగన్వాడీ సిబ్బంది రవికుమార్, రేణుకమ్మ, అన్నపూర్ణమ్మ, దివ్య, ప్రత్యూష, జ్యోతి, షాకీర, కృష్ణమ్మ, హరిత, జరీనా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.